
రైతులకు నిరాశే...

● నైరుతి రుతుపవనాల్లో ముఖం చాటేసిన వరుణుడు ● జిల్లాలో అంతంతమాత్రమే వర్షాలు

● జిల్లాలో నిండుకున్న జలాశయాలు ● వైసీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టులకు నిధులు నిల్..



బాహుదా ప్రాజెక్టు కాలువల్లో అడవిని తలపిస్తున్న ముళ్లపొదలు



వర్షాలు కురవకపోవడంతో ఎండిపోయిన బాహుదా ప్రాజెక్టు

మదనపల్లె టౌన్, ఆగస్టు 12: దేశంలో నైరుతి రుతుపవనాలతో సకాలంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిన క్రమంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు వర్షాల కోసం ఎంతో ఆశగా ఎదురుచూశారు. కానీ వారిని నిరాశపరుస్తూ నైరుతి పవనాలతో అంతంత మాత్రమే వర్షాలు కురిశాయి. ప్రతిరోజు నల్లని మేఘాలు కమ్ముకోవడం.. అది చూసి మంచి వర్షం కురుస్తుందని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిల్చి నీటిచుక్క రాల్చకుండా మేఘాలు వెళ్లిపోతున్నాయి. కనీసం సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో ప్రస్తుతం రైతులు వాతావరణంలో కలిగే మార్పులతో వచ్చే 'లానినా'పైనే ఆశలు పెంచుకున్నారు.

ఎల్‌నినోతో కరువు.. లానినాపై ఆశలు

వాతావరణంలో కలిగే మార్పులతో సముద్రాల్లో ఏర్పడే స్థితులనే ఎల్‌నినో, లానినా అంటారు. స్పానిష్ భాషలో పిలుచుకునే ఎల్‌నినో అంటే సముద్రంలో అల్పపీడనం ఏర్పడినప్పుడు డిసెంబరు నెలలోనే సముద్రంలోని నీటి వేడి 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ పెరుగుతుంది. తీవ్ర వర్షాభావం ఏర్పడుతుంది. శీతాకాలం, ఎండాకాలం, వర్షాకాలంలో విపరీత వాతావరణం ఉంటుంది. సరిగ్గా 22 ఏళ్ల క్రితం ఏర్పడిన ఎల్‌నినో కారణంగా దేశంలో వర్షాలు కురవక తీవ్ర దుర్భిక్షం నెలకొంది. అప్పట్లో సాధారణ వర్షపాతం కంటే కేవలం 40 శాతం లోపు వర్షాలు మాత్రమే కురిశాయి. దీనికి ఎల్‌నినో ప్రభావమే కారణమని వాతావరణ శాస్త్రజ్ఞులు విశ్లేషించారు. ఎల్‌నినో తరువాతి సంవత్సరమే 2003లో వాతావరణ పరిస్థితులతో ఏర్పడే లానినా కారణంగా కుంభవృష్టితో దేశంలో దాదాపు అన్ని నదులకు వరదలు సంభవించాయి. ఈ క్రమంలో 2023 డిసెంబరులో దేశానికి ఎల్‌నినో ప్రభావం రాగా శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పెరగడం, వేసవి కాలంలో 40 డిగ్రీల సెల్సియస్ కన్నా ఎండలు నమోదు కావడం చూశాము. ఇప్పుడు వర్షాకాలంలో అంతంత మాత్రంగానే వర్షాలు కురుస్తున్నాయి. ఇది జరిగి ఏడాది అంటే ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో లానినా పరిస్థితి వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. ఇదే వస్తే కుంభవృష్టితో వర్షాలు కురుస్తాయి. దీనికి ఉదాహరణే ఇటీవల కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నది, మధ్యప్రదేశ్‌లో కురుస్తున్న వర్షాలతో గోదావరి నదులకు వరదలు వచ్చాయి. దీంతో కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల్లో నదుల వరద నీరు డ్యాములు దాటుకుంటూ, ఆంధ్ర రాష్ట్రం గుండా సముద్రంలో కలుస్తోంది.

జిల్లాలో నిండుకున్న జలాశయాలు

జిల్లాలోని 30 మండలాల్లో అడపదడపా వర్షాలు కురుస్తున్నాయే కానీ జలాశయాలు నిండే పరిస్థితి కనపడటం లేదు. జిల్లాలో వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు వెలిగల్లు, పింఛా, అన్నమయ్య, ఝరికోన, తంబళ్లపల్లె మండలంలో పెద్దేరు ప్రాజెక్టు, నిమ్మనపల్లె మండలంలో బాహుదా ప్రాజెక్టుతో పాటు పీటీఎం మండలంలో వ్యాసరాయసముద్రం, పెద్దతిప్పసముద్రం(పెద్ద చెరువులు) ఉన్నాయి. ఇవే రైతులకు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి. వర్షాకాలంలో కురిసే వర్షాలకు ఈ జలాశయాలు నిండితే ఖరీఫ్‌తో పాటు, రబీ సీజన్‌లో కూడా రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురవక జిల్లాలో కేవలం వెలిగల్లు, పెద్దేరు, పింఛా ప్రాజెక్టుల్లో మాత్రమే కేవలం 40 శాతం దాకా సాగునీరు అందుబాటులో ఉంది. మిగిలిన వాటిలో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో వర్షాలు వచ్చినా నీరు నిల్వ ఉండే అవకాశం లేదు. ఇకపోతే మదనపల్లె డివిజన్‌లో వర్షాలు కురవక పీటీఎం మండలంలోని వ్యాసరాయసముద్రం చెరువు, పెద్దతిప్పసముద్రం చెరువు, బాహుదా ప్రాజెక్టులు కనీసం స్థాయిలో కూడా నీటిమట్టాలు లేవు. దీంతో ఈ ఖరీఫ్ కాదు కదా రబీ సీజన్‌లో కూడా ఈ జలాశాయాలు కింద ఆరుతడి పంటలు సాగు చేసే పరిస్థితి కనపడటం లేదు. ఈ క్రమంలో లానినా పరిస్థితి వస్తే జిల్లాలో అధికశాతం వర్షాలు కురుస్తాయని రైతులు ఊహిస్తున్నారు. ఇదే జరిగితే జలాశయాల్లో నీరు నిల్వ ఉండి వచ్చే రబీ సీజన్‌లో అయినా పంటలు పండుతాయని రైతులు ఆశపడుతున్నారు.

నిధులు కేటాయించని వైసీపీ ప్రభుత్వం


వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. ఓవైపు అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినా నిర్వాసితులకు ఎలాంటి పరిహారం చెల్లించలేదు. మరోవైపు మదనపల్లె డివిజన్‌లోని పెద్దేరు, బాహుదా ప్రాజెక్టుల నిర్వహణ, సాగునీటి కాలువల మరమ్మతులకు కూడా వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయక నిర్లక్ష్యం చేసింది. దీంతో ఈ రెండు ప్రాజెక్టుల కింద కాలువల్లో ముళ్లకంపలు పెరిగిపోయి ఎక్కడ చూసినా కాలువ కట్టలకు గండ్లు పడే అవకాశం ఉంది. ఒకవేళ ఈ ప్రాజెక్టులు నిండినా వీటి కింద ఆయకట్టులోని చివరి ఎకరా భూమికి నీరు సాగే అవకాశాలు లేవు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టుల నిర్వహణకు, మరమ్మతులకు నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.



రూ.1.06 కోట్ల నిధులకు నివేదికలు పంపించాం..

మదనపల్లె డివిజన్‌లోని పెద్దేరు, బాహుదా ప్రాజెక్టుల కాలువల మరమ్మతులకు, ప్రాజెక్టుల నిర్వహణకు రూ.1.06 కోట్ల నిధులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపాము. ఇందులో పెద్దేరుకు రూ.92 లక్షలు, బాహుదా ప్రాజెక్టుకు రూ.24 లక్షల నిధులు అవసరం ఉంది. నిధులు మంజూరవుతూనే పనులు చేపడతాము.

- సురేంద్రరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, జలవనరుల శాఖ, మదనపల్లె



పెద్దేరు ప్రాజెక్టులో 40 శాతం మాత్రమే ఉన్న సాగునీరు



పెద్దేరు ప్రాజెక్టు కాలువలో మొలిచిన పిచ్చిమొక్కలు



రెడ్డిబాబు, వెంకటలక్ష్మిలతో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి తదితరులు

ఎర్రకోటకు లక్కిరెడ్డిపల్లె వాసులు

● పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఎంపిక

● ఢిల్లీకి పయనం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 12: పీఎం ఆవాస్‌యోజన పథకం కింద లక్కిరెడ్డిపల్లెకు చెందిన వీరబల్లి వెంకటలక్ష్మి, వీరబల్లి రెడ్డిబాబు దంపతులకు ఈనెల 15వ తేదీ ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు వారిద్దరూ సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారని ఎంపీడీవో వెంకటరమణారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెకు చెందిన ఈ దంపతులు పీఎం ఆవాస్ యోజన కింద వివిధ పథకాల్లో లబ్ధి పొందడంతో పాటు ప్రభుత్వానికి వాటికి సంబంధించిన డబ్బులు కూడా సకాలంలో చెల్లించడంతో ప్రభుత్వం వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. మండలం నుంచి మొత్తం 10 మందిని ఎంపిక చేయగా అందులో నుంచి స్క్రూటినీ చేసి వీరిద్దరినీ ఢిల్లీకి పంపుతున్నాట్లు తెలిపారు. వారికి ఢిల్లీకి విమానం టికెట్లు, ఢిల్లీలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆ దంపతులను ఎంపీడీవో పాటు బ్లాక్ కో-ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, సూపరింటెండెంట్ గురుప్రసాద్ అభినందించారు.

20న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

● కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తదితరులు

రాయచోటిటౌన్, ఆగస్టు 12: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ చేపట్టనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలు, కరపత్రాలను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలు 4 లక్షల 6 వేల 121 మంది ఉన్నారని, వారందరికీ ఈనెల 20వ తేదీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డీవార్మింగ్ డేను ఈనెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, డిగ్రీ, పాలిటెక్నిక్, నర్సింగ్, జూనియర్ కళాశాలలో ఉన్న 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మధ్యాహ్న భోజనం అనంతరం పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమం అమలు విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సంయుక్తంగా పనిచేయాలన్నారు. విద్యార్థుల్లో రక్తహీనత నివారించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు. ముఖ్యంగా కిశోర బాలికలకు ఐరన్ అత్యంత అవసరమని అందుకే రక్తహీనత రహిత సమాజ స్థాపనకు అందరం కలిసి పనిచేద్దామని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, జిల్లా రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ శివప్రతాప్, స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ శశికళ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.


స్టాఫ్ నర్సుల నియామకానికి కౌన్సెలింగ్

కలికిరి, ఆగస్టు 12: వైద్య ఆరోగ్య శాఖ కడప ప్రాంతీయ డైరెక్టరేట్ పరిధిలో స్టాఫ్ నర్సుల నియామకాల కోసం మెరిట్ ఆధారంగా అర్హులైన వారిని నియమించడానికి మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రాంతీయ డైరెక్టర్ కార్యాలయం పేర్కొంది. గత ఏడాది జనవరిలో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం 206 మంది స్టాఫ్‌నర్సులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించడం కోసం జరిగిన కసరత్తు అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా నియామకాలు చేపట్టనున్నారు. మంగళవారం నుంచి గురువారం మినహా శనివారం వరకూ ఈ కౌన్సెలింగ్ షెడ్యూలును ప్రకటించారు. కడప పాత రిమ్స్‌లోని ప్రాంతీయ వైద్య సంచాలకుల కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఏయే రోజు ఎవరెవరు హాజరు కావాలనే వివరాలను వైద్య ఆరోగ్య శాఖ కమిషనరు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆ మేరకు మెరిట్ అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో అర్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. దీనిపైన ఏవైనా ఫిర్యాదులుంటే కడప ప్రాంతీయ సంచాలకులు 94402 90777 లేదా ఉప సంచాలకులు 93819 050378 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అమరావతి నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

● సీఎం చంద్రబాబుకు చెక్కు ఇచ్చిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 12: ఆంధ్రుల రాజధాని అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రూ.3 లక్షల 1116 విరాళంగా అందజేశారు. సోమవారం ఆయన సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి తన మొదటి నెల జీతం రూ.3,01,116లు చెక్కును విరాళంగా అందజేశారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న మంత్రి మండిపల్లి

బస్సు డ్రైవర్ చాకచక్యం.. తప్పిన పెనుప్రమాదం

● బస్సును ఢీకొన్న లారీ ● లారీ డ్రైవర్ మృతి ● 40 మంది ప్రయాణికులు సురక్షితం



వాల్మీకిపురం మండలం విఠలం వద్ద చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు

వాల్మీకిపురం, ఆగస్టు 12: ప్రైవేట్ బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన సోమవారం సాయంత్రం వాల్మీకిపురం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి నుంచి బయలుదేరిన భారతి ప్రైవేట్ బస్సు బెంగళూరుకు వెళ్తుండగా మదనపల్లె నుంచి తిరుపతికి వెళ్తున్న ఏపీ04టిడబ్ల్యూ 7320 నెంబర్ గల ఐషర్ లారీ అతివేగంగా వెళ్తూ మార్గమధ్యంలో మండలంలోని విఠలం గ్రామం పాదాల గుడి సమీపాన బస్సుపైకి దూసుకెళ్లింది. అదే సమయానికి గమనించిన బస్సు డ్రైవర్ రాఘవ చాకచక్యంగా అప్పటికే లారీ దూసుకొచ్చి బస్సు ముందు భాగంలో ఒక సైడ్ ఢీకొనగా బస్సును పక్కనే ఉన్న చింతచెట్టును తప్పించి పక్కనే ఉన్న పొదల్లోకి మళ్లించడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణికులు బిగ్గరగా కేకలు పెట్టారు. బస్సులో ప్రయాణిస్తున్న వాల్మీకిపురానికి చెందిన కానిస్టేబుల్ గిరి ప్రయాణికులకు ధైర్యం చెప్పి వేరే వాహనాలలో వెళ్లే ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగం నుజ్జు కాగా లారీ డ్రైవర్ సర్వర్‌ఖాన్ అలియాస్ బాబూజీ తీవ్ర గాయాలతో లారీలోనే ఇరుక్కుపోయాడు. సీఐ శేఖర్, ఎస్‌ఐ నాగేశ్వర్‌రావులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితి విషమంగా ఉన్న లారీ డ్రైవర్‌ను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. స్వల్ప గాయాలతో బయటపడ్డ బస్ డ్రైవర్ రాఘవను చికిత్స నిమిత్తం వాల్మీకిపురం ఆస్పత్రిలో చేర్పించారు. బస్సులో ఆ యిదారుగురుకి స్వల్ప గాయాలు తప్ప అంద రూ సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడటంతో బస్సు డ్రైవర్ రాఘవను అభినందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




నుజ్జునుజ్జయిన ఐషర్ లారీ ముందు భాగం

స్కూల్ వ్యాను బోల్తా

● చిన్నారి మృతి

● విద్యార్థులకు గాయాలు

● శోకసంద్రంగా ఘటన ప్రాంతం



వ్యాన్ ఫుట్‌పాత్‌లో ఇరుక్కుపోయి మృతి చెందిన భవిష్యరెడ్డి



భవిష్యరెడ్డి (ఫైల్)

ఓబులవారిపల్లె, ఆగస్టు 12: పెళ్లయిన ఎన్నో ఏళ్లకు పుట్టిన బిడ్డ.. అల్లారుముద్దుగా పెంచుకున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో అమ్మానాన్నలతో ఆనందంగా గడిపిన ఆ చిన్నారి సోమవారం స్కూల్‌కు వెళ్లేందుకు ఎంతో ఆనందంగా ఇంట్లో అందరికీ టాటా చెబుతూ స్కూల్ వ్యాను ఎక్కింది. పది నిమిషాల్లో స్కూల్‌కు చేరాల్సి ఉండగా వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడటంతో రెండో తరగతి చదువుతున్న వీరంరెడ్డి భవిష్యరెడ్డి (7) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన ఓబులవారిపల్లెలో సోమవారం ఉదయం 8 గంటలకు జరిగింది. మండల కేంద్రంలోని ఓబులవారిపల్లె గ్రామానికి చెందిన వీరంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, అరుణ దంపతులకు పుట్టిన మొదటి సంతానం వీరంరెడ్డి భవిష్యరెడ్డి (7) చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లె గ్రామానికి దగ్గరగా ఉన్న శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్యలో ఓబులవారిపల్లె నుంచి సుమారు 15 మంది విద్యార్థులతో కలిసి స్కూల్ వ్యాన్ బయలుదేరి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మార్గమధ్యలో ఉన్న పాములేరు బ్రిడ్జిని దాటుకోగానే వాహనం స్టీరింగ్ పట్టేయడంతో అదుపు తప్పి ఎడమవైపు రక్షణగా ఉన్న సిమెంట్ దిమ్మెలను గుద్దుకుంటూ రోడ్డుపై నుంచి సుమారు 10 అడుగుల లోతులో ఉన్న మట్టిరోడ్డుపై పడిపోయింది. దీంతో విద్యార్థులు ఒకరిపై ఒకరు పడ్డారు. ఈ ఘటనలో వీరంరెడ్డి భవిష్యరెడ్డి ఫుట్‌పాత్‌కు మధ్యలో పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన గమనించిన ప్రజలు స్కూల్ వ్యాను అద్దాలు పగులగొట్టి విద్యార్థులను రక్షించారు. విద్యార్థులు వెళుతున్న వాహనం ప్రమాదానికి గురై ఒక పాప మృతి చెందడంతో ఓబులవారిపల్లె మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. వ్యాను ప్రమాదానికి గురైన ఘటనను తెలుసుకున్న ఓబులవారిపల్లె తహసీల్దార్ పీర్‌మున్ని సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అదేవిధంగా రైల్వేకోడూరు సీఐ బాబు, ఎస్‌ఐ మహేష్‌లు సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి పాఠశాల కరస్పాండెంట్ సత్యకుమార్‌ను అడిగి వివరాలు సేకరించారు. డీఎస్పీ రామచంద్రగౌడ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి హాజరై పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పలువురు అధికారులు వెల్లడించారు.



బోల్తా పడ్డ వ్యాన్ వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

విద్యార్థి సంఘ నాయకుల ఆగ్రహం

కండీషన్ లేని వాహనాలు, నైపుణ్యంలేని డ్రైవర్లను ఏర్పాటు చేసుకుని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విద్యార్థి సంఘాలు, కమ్యూనిస్టు నాయకులు ఆరోపిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందాలని, పరిమితికి మించి విద్యార్థులను ఒకరిపై ఒకరు కూర్చోబెట్టి తీసుకెళ్లడం, వాహనాలను తక్కువ పెట్టి ఎక్కువ మంది విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. అధిక వేగంతో వాహనాలు నడపడంతో నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులకు కడుపుశోకాన్ని మిగిలిస్తున్నారని, అధికారులు, నాయకులు ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆస్పత్రిలో వర్షం నీరు..

● బయటపడ్డ ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణాల డొల్లతనం

● రోగుల గదులు, డాక్టర్ల గదుల్లో నిలిచిన వర్షం నీరు ● కాంట్రాక్టర్, ఇంజనీర్లపై ఎమ్మెల్యే ఆగ్రహం

మదనపల్లె టౌన్, ఆగస్టు 12: ప్రజాధనం వెచ్చించి నిర్మిస్తున్న సర్వజన బోధనాస్పత్రిపై అదనపు పడకలు, డాక్టర్ల గదుల నిర్మాణంలో డొల్లతనం వర్షంతో బట్టబయలైంది. ఆదివారం రాత్రి మదనపల్లెలో 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో సర్వజన బోధనాస్పత్రి మొదటి అంతస్తులో నిర్మించిన కొత్త భవనాల్లో కొన్ని రోగుల గదులు, డాక్టర్ల గదులు వర్షం నీటితో నిండిపోయాయి. దీంతో సిబ్బంది బకెట్లతో నీటిని తోడి బయటకు పడేయాల్సిన దుస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రభుత్వాస్పత్రిలో వర్షంతో తడిచిన గదులను పరిశీలించి, రోగుల అవస్థలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందల కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణాల్లో నాణ్యత లేదని, ఇప్పుడు చూస్తే వర్షానికే ప్రభుత్వాస్పత్రిపైన ఉన్న రోగుల గదులు, డాక్టర్ల గదులు వర్షపునీటితో నిండిపోవడం చూస్తే ఇంజనీర్ల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉందన్నారు. కేవలం ఈ కొత్త భవనాలు ఉపయోగంలోకి తీసుకొచ్చి రెండు నెలలు కూడా తిరక్కముందే వర్షపు నీటితో గదులు ఉరుస్తుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడ పనిచేస్తున్న ఇంజనీర్లను బదిలీ చేయాలని, కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకోవాలని ఏపీఎంఎస్‌ఐడీసీ సీఈకి ఫోన్ చేసి వివరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నాణ్యత లేని భవనాలను నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తామన్నారు. కాగా భవన నిర్మాణ విషయమై ఎమ్మెల్యేకు వివరించేందుకు ప్రయత్నించిన డీఈ కరీముల్లాపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు బిల్డింగ్ ప్లాన్ ఏముంది.. ఇక్కడ కట్టిన నిర్మాణాలు ఏంటంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, సిబ్బంది పాల్గొన్నారు.





ప్రభుత్వాస్పత్రి కొత్త భవనాల్లో డాక్టర్ల గదిలో నిలిచిన వర్షపు నీటిని బకెట్లతో తోడుతున్న సిబ్బంది

ప్రభుత్వాస్పత్రిలో నిర్మాణాల నాణ్యత, రోగుల అవస్థలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజల సమస్యలను పరిష్కరించండి : ఎస్పీ

రాయచోటి టౌన్, ఆగస్టు 12: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. 45 మంది ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల సమస్యలను వింటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి



రాయచోటి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 12: ప్రజా సమస్యలకు బాధ్యతగా పరిష్కారం చూపాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో ప్రజా సమస్యల పరిస్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిస్కార వేదిక కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. అందిన ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు నాణ్యతతో బాధ్యతాయుతంగా పరిష్కరించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి అవగాహన కలిగి... క్షేత్రస్థాయిలో వెళ్లి పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ అదర్శరాజేంద్రన్, డీఆర్ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ వెంకటసుబ్బయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలో ఈనెల 16 నుంచి 30 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులలో భూసమస్యలపై అధికారులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 15 న ప్రారంభించడం జరుగుతుందన్నారు.

జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ కోరారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ అవరణలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటకశాఖ ఆద్వర్యంలో భారత జాతీయ జెండాతో సెల్ఫీ మరియు సంతాకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పోస్టర్‌పై సంతకం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఇంటిమీద జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. టూరిజంశాఖ అధికారి నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లాలో ఈనెల 20న నిర్వహించే జాతీయ నుళిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నులి పురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అవిష్కరించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈ మాత్ర లు పంపిణీ చేస్తారని తెలిపారు.

జాతీయ రహదారి పనులు ప్రారంభించాలి

వేంపల్లె, ఆగస్టు 12: కడప-రాజంపేట-రేణిగుంట జాతీయ రహదారి పనులు త్వరగా ప్రారంభించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈరహదారి నిరంతరం రద్దీగా ఉంటుందన్నారు. చెన్నై-ముంబై మహానగరాలను అనుసంధానం చేసే రహదారిని.. రూ.2254 కోట్లతో, 122 కిలోమీటర్ల పొడవుతో నాలుగు వరుసల రహదారి మంజూరైందన్నారు. 2023 అక్టోబరులో టెండర్ పూర్తి అయి పది నెలలు అయినా.. పనులు మొదలుపెట్టలేదన్నారు. 100హెక్టార్ల అటవీభూమికి సంబంధించి అనుమతిరాని కారణంగా పనులు మొదలుపెట్టలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని ఫారెస్ట్ క్లియరెన్స్ తెప్పించి.. త్వరగా పనులు మొదలుపెట్టాలన్నారు. అలాగే వేంపల్లె-రాయచోటి రహదారి విస్తరణ పనులు కూడా త్వరగా పూర్తిచేయాలని, మూడేళ్లుగా ప్రయాణికులు నరకం చూస్తున్నారని తెలిపారు.

క్విజ్ పోటీలలో యువత ప్రత్యక్షంగా పాల్గొనాలి



మాట్లాడుతున్న మణికంఠ

కడప (మారుతీనగర్) ఆగస్టు 12 : 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురష్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్ మీటింగ్ హాల్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో ఆయన మాట్లాడారు. క్విజ్ పోటీలలో యువత ప్రత్యక్షంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందులో ప్రధానంగా కరెంట్ ఎఫైర్స్, హిస్టరీ, పాలిటిక్స్, జియోగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, తదితర అన్ని సబ్జెక్టులపై ప్రశ్నలు వుంటాయన్నారు. అన్ని కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు పాల్గొనాలన్నారు. క్విజ్‌లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, విజేతలకు నగదు బహుమతితో పాటుగా సర్టిఫికెట్ల ప్రదానం చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9177616677 అనే నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు



ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 12: వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులోని జవహర్ బాలకేంద్రంలో శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనపరిచారు. ఎనిమిది బంగారు పతకాలు, ఆరు రజత పతకాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించారు. శని, ఆదివారాల్లో ఏపీ అమెక్యూ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 9వ ఇంటర్ స్టేట్ ఇంటర్నేషనల్ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సబ్‌జూనియర్ బాలికల విభాగంలో నందిని, జాహ్నవి, సంజన వెండి పతకాలు సాధించగా.. సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఉస్మాన్, ఇర్ఫాన్, అభిరామ్, యువరాం, దీక్షిత్, కార్తవ్యార్జున్‌లు బంగారు పతకాలు సాధించారు. గౌరీశ్వర్, దక్షిత్, శ్రావణ్‌లు వెండి పతకాలు, సంజీవ్, జోగీశ్వర్, సాత్విక, హేమంత్‌లు కాంస్య పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో శివనాథ్, హేమశ్రీలు బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ మాస్టర్ మునీశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రైలుకింద పడి విద్యార్థి ఆత్మహత్య



రాజంపేట, ఆగస్టు 12: రాజంపేట మండల పరిధిలోని హస్తవరం గ్రామ సమీపంలో రైల్‌ట్రాక్‌పై పవన్‌కళ్యాణ్(23) అనే విద్యార్థి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే... రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో కలసపాడు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన దాసరి పవన్ కళ్యాణ్ రెండో సంవత్సరం ఎంసీఏ చదువుతున్నాడు. గత రెండు రోజులుగా పవన్‌కళ్యాణ్ తన స్నేహితులతో ముభావంగా ఉండే వాడని.. సోమవారం ఉదయం పవన్‌కళ్యాణ్ హాస్టల్ నుంచి కళాశాలకు వెళ్లలేదు. కళాశాలకు దగ్గరగా ఉన్న హస్తవరం రైల్వేట్రాక్‌పైకి వెళ్లి రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిసింది. మృతుని తల పూర్తిగా నుజ్జు కావడంతో దుస్తులను బట్టి గుర్తించారు. పవన్‌కళ్యాణ్‌కు తల్లీ, తమ్ముడు, అక్క ఉన్నారు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట తరలించారు.

ఆలయ హుండీ పగలగొట్టి.. నగదు చోరీ



గాలివీడు, ఆగస్టు 12: మండలంలోని కొర్లకుంట పంచాయతీ భయ్యారెడ్డి గారిపల్లెకు సమీపంలో వెలిసిన మాంకాలమ్మ ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకుల వివరాల మేరకు... సోమవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి పూజ చేయడానికి భక్తులు వెళ్లగా.. హుండీ కనపడకపోవడంతో వెంటనే ఆలయ నిర్వాహకులకు తెలియజేశారు. వెంటనే వారు ఆలయానికి చేరుకొని చుట్టుపక్కల గాలించి.. సమీపంలోని పొలంలో హుండీని గుర్తించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు హుండీలోని నగదును చోరీకి పాల్పడినట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.కోట్లు ఆశచూపి..కొట్లాట..!

- రూ.2 కోట్ల విలువైన నాణెం ఉందని మాయమాటలు
- కడప నుంచి విజయవాడ రప్పించి ఘర్షణ
- ముగ్గురిని లాడ్జిలో నిర్బంధించి చిత్రహింసలు
- 14 మందిని అరెస్టు చేసిన పోలీసులు

విజయవాడ వన్‌టౌన్, ఆగస్టు 12: కోట్ల విలువైన రామలక్ష్మణ్ నాణెం పేరిట మోసం చేయడమే కాకుండా, ముగ్గురిని కడప నుంచి రప్పించి, నిర్బంధించి, బెదిరించిన ఘటన నగరంలో సోమవారం వెలుగుచూసింది. ఈ కేసులో గవర్నర్‌పేట పోలీసులు 14 మందిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. కడపలోని నాగరాజుపేటకు చెందిన రాజేంద్ర మొబైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతనికి రెండు నెలల క్రితం తిరుపతిలోని ఒక రెస్టారెంట్‌లో అన్నమయ్య జిల్లాకు చెందిన నరసింహ పరిచయమయ్యాడు. తన వద్ద రామలక్ష్మణ్ కెమికల్ నాణెం ఉందని, అది రూ.2కోట్ల విలువ చేస్తుందని చెప్పాడు. దానికి నగిషీ చేయటానికి రూ.3 లక్షలు అవుతుందని రాజేంద్రను కోరాడు. ఆ తర్వాత వారిద్దరూ మదనపల్లిలో కలిశారు. అనుమానం వచ్చిన రాజేంద్ర.. తనకు నాణెం చూపించాలని నరసింహను కోరాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. ఆ తరువాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. అనంతరం వాట్సాప్ ద్వారా నాణెం వీడియోను పంపించిన నరసింహ.. అది కావాలంటే విజయవాడ రావాలని చెప్పాడు. ఇది నమ్మిన రాజేంద్ర మరో ఇద్దరితో కలిసి సోమవారం ఉదయం కడప నుంచి విజయవాడ వచ్చాడు. నరసింహకు ఫోన్ చేయగా, తాను రాయనపాడు చెరువు దగ్గర ఉన్నానని, అక్కడకు రమ్మన్నాడు. గతంలో గొడవపడినప్పుడు తన ఫోన్ తీసుకున్నావని, దానిని ఇవ్వమని నరసింహ.. రాజేంద్రను కోరాడు. దీంతో ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో నరసింహ మరో 14 మందితో కలిసి రాజేంద్రను, అతనితో వచ్చిన ఇద్దరిని కొట్టారు. ముగ్గురిని బలవంతంగా కారులో ఎక్కించుకుని ఓ లాడ్జిలో బంధించి, మళ్లీ కొట్టారు. రాజేంద్ర భార్యకు ఫోన్‌చేసి రూ.30 లక్షలు ఇస్తే వదిలిపెడతామని, లేకపోతే చంపేస్తామని బెదిరించారు. ఈ విషయాన్ని రాజేంద్ర తన బావకు మెసేజ్ చేయగా, ఆయన 112 కాల్ ద్వారా పోలీసులకు విషయం తెలియజేశారు. వెంటనే స్పందించిన పోలీసులు లాడ్జికి వెళ్లి రాజేంద్రను, అతని స్నేహితులను కాపాడారు. రాజేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసింహ (26), భవానీపురానికి చెందిన ప్రవీణ్ అలియాస్ సన్నీ (25), దినేష్ (24), విద్యాధరపురానికి చెందిన బూరి రాజేశ్ (25), రాయనపాడుకు చెందిన ధీరజ్ (24), విద్యాధరపురానికి చెందిన సోహైల్ అర్షద్ (23), రాయనపాడుకు చెందిన స్వాగత్ (23), గోనాడ, సీతారామ్, పాండు, నాని, సందీప్, సాంబ, సాయి, సత్య తదితరులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో పలువురిపై కేసులు ఉన్నాయి.

వసతిగృహాలపై శ్రద్ధ వహించండి : బీసీ వెల్ఫేర్ డైరెక్టర్



హైడ్రోపోనిక్ నీటి సాగు యూనిట్ ప్రారంభిస్తున్న డైరెక్టరు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 12: వసతిగృహాల పట్ల శ్రద్ధ వహించాలని బీసీ వెల్ఫేర్ డైరెక్టరు మల్లిఖార్జున అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని ప్రభుత్వ బీసీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులతో ఆయన మమేకమయ్యారు. విద్యార్థుల అభ్యసనా పరిస్థితులు పరిశీలించారు. అనంతరం హైడ్రోపోనిక్ నీటి సాగు యూనిట్‌ను ప్రారంభించారు.

ఈసందర్భంగా విద్యార్థుల సమస్యలు, అవసరాలపై వారితో చర్చించారు. చదువు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు ప్రోత్సాహక వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. హైడ్రోపోనిక్ నీటి సాగు పద్ధతి గురించి వివరించడం ద్వారా పర్యావరణ అనుకూలమైన వ్యవసాయ విధానం మారుతుందని.. ఇది విద్యార్థుల అభ్యాసంలో ప్రత్యేక శక్తిని కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడమే కాకుండా హాస్టలు పరిసరాలను పచ్చదనంతో నింపవచ్చున్నారు. దీంతో పాటు ఆహార పౌష్టిక పెంపొందించడం కూడా సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులు పలు సమస్యలను ఆయన దృష్టికితెచ్చారు. కార్యక్రమంలో హాస్టలు సంబంధిత అధికారులు, బీసీ సంక్షేమ శాఖ సాధికారిక అధికారి ఎస్.భరత్‌కుమార్‌రెడ్డి, సహాయ సంక్షేమ అధికారులు ఆర్.నాగేంద్రరాజు, జ్యోతి పాల్గొన్నారు.

ప్రారంభమైన వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు



తనిఖీ చేస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రారు తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12: వైవీయూ పరిధిలో అనుబంధ డిగ్రీకళాశాలల విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు డిగ్రీ ఐదో సెమిస్టరు పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాలల విద్యార్థులు యూనివర్శిటీ కేంద్రంలో హాజరయ్యారు. పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలించారు. అన్ని సౌకర్యాలతో పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.

చోరీ కేసులో న్యాయం చేయాలి

- జిల్లా ఎస్పీకి బాధితులు ఫిర్యాదు

జమ్మలమడుగు, ఆగస్టు 12: జమ్మలమడుగు పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో సచివాలయం ఎదురుగా ఉన్న 21/1021-6 ఇంటిలో మే 11న దొంగలు చోరీకి పాల్పడి.. 30 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. అదే రోజు బాధితులు అన్నలయ్య, అనిత, ఆమె భర్త ఎ.నరసింహాచార్యులు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని.. అయితే 20 తులాలు మాత్రమే చోరీ జరిగిందని అర్బన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేశారని తెలిపారు. దీనిపై గత నెల 21వ తేదీ కడప జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని.. అదే రోజు అక్కడున్న అధికారులు జమ్మలమడుగు ఇన్‌చార్జి డీఎస్పీ, ప్రొద్దుటూరు రెగ్యులర్ డీఎస్పీ మురళీధర్‌కు ఫిర్యాదు పత్రాన్ని పంపించారన్నారు. డీఎస్పీ వద్దకు వెళ్లి సమస్యను తెలియజేయగా సీఐ కరుణాకర్‌కు చార్జి మెమో ఇచ్చి.. వెంటనే చోరీకి గురైన బంగారం రికవరీ చేయాలని ఆదేశించినట్లు బాధితులు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్నతాధికారుల ఆదేశాలను అర్బన్ సీఐ పట్టించుకోలేదన్నారు. దీంతో సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి ఫిర్యాదు చేశామని... ఎస్పీ నేరుగా అర్బన్ సీఐతో ఫోన్‌లో మాట్లాడి కేసుకు సంబంధించి విచారణ వేగవంతం చేసి 30 తులాల బంగారు త్వరగా రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

జీతం అడిగినందుకు దళిత మహిళపై దాడి

- పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు



గాయపడిన సుంకేసుల పావని

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 12: జీతం అడిగినందుకు రూంలో వేసి దళిత మహిళను చితకబాది గాయపరిచిన సంఘటన సోమవారం ఒక హోటల్‌లో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.... రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేటలో ఒక హోటల్‌లో దళిత మహిళ సుంకేసుల పావని పనిచేస్తోంది. మూడు నెలల నుంచి హోటల్ యజమాని జీతం ఇవ్వలేదని పావని నిలదీసింది. దీంతో యజమాని హోటల్‌లోని ఒక గదిలో వేసి తలుపులు మూసివేసి విచక్షణ రహితంగా దాడి చేసి గాయ పరిచినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. జీతం ఇవ్వకుంటే ఇంటిలో జరుగుబాటు ఎలా చేసుకోవాలని హోటల్ యజమా నిని అడిగినందుకు తనపై దాడికి పాల్పడ్డాడని వాపోయింది. హోటల్‌లో జీతం నెలకు రూ.9,500లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ మేరకు యజమా నిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

వేమలూరు రేషన్‌షాపు సీజ్

అట్లూరు, ఆగస్టు 12: మండలంలోని వేమలూరు రేషన్‌షాపును శనివారం జిల్లా అసిస్టెంటు సప్లై అధికారి తారకనాధరెడ్డి సీజ్ చేసి.. నిర్వాహకురాలు చింతకుంట సుప్రజాపై 6ఎ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దారు శివశంకర్ తెలిపారు. మధ్యాహ్న భోజనం బియ్యానికి సంబంధించి 120 బస్తాలు వ్యత్యాసం ఉండడంతో రేషన్‌షాపు సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. స్థానిక వీఆర్‌ఏ చాన్‌బాషాకు రేషన్ షాపును అప్పగించామని తెలిపారు. బద్వేలు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి చంద్ర, అట్లూరు ఇన్‌స్పెక్టరు కరీముల్లా, వీఆర్వో సుబ్బయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వల్లూరు, ఆగస్టు 12: మండల పరిధిలోని తప్పెట్ల వద్ద కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్బరాయుడు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో సుబ్బరాయుడు కాలు విరిగినట్లు సమాచారం. వాహన చోదకులు గమనించి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టౌన్‌ప్లానింగ్ ఏసీపీపై టీడీపీ నేత దాడికి యత్నం

- సోషల్ మీడియాలో వైసీపీ ప్రచారం
- ఏమి జరగలేదన్న కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 12: మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నంపై టీడీపీ కౌన్సిలర్ చింతకుంట సరిత భర్త, టీడీపీ నాయకుడు చింతకుంట జయలింగారెడ్డి అసభ్యంగా దూషించి దాడికి యత్నించారని వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేసింది. దీంతో టీడీపీ వారు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మీద దాడికి యత్నం అవాస్తవమని... వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని సోషల్ మీడియాలో వెల్లడించారు. దీంతో ఈ దాడి యత్నం విషయంపై వాస్తవాలను కమిషనర్ రఘునాథరెడ్డిని వివరణ కోరగా.. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌కు మధ్యాహ్నం 1.30 గంటలకు కౌన్సిలర్ సరిత, ఆమె భర్త జయలింగారెడ్డిలు ఏసీపీ మునిరత్నం రమ్మంటే వచ్చారన్నారు. కౌన్సిల్ సమావేశంలో సరిత నడింపల్లె కాలువను ఆక్రమించి నాలుగు ఇళ్ల నిర్మించడంపై ప్రశ్నించారు. దీనిపై వివరణ ఇవ్వడానికి ఏసీపీ మునిరత్నమే పిలిపించారన్నారు. ఆ నాలుగు ఇళ్లు కాలువపై నిర్మించలేదని.. అక్కడ రికార్డు ప్రకారం కాలువే లేదని.. అది పూర్తిగా పట్టా భూమి అని వెల్లడించారు. వారి పట్టా భూముల్లో నిర్మించి నందువల్ల ప్లాను ఇచ్చామని ఏసీపీ మునిరత్నం తెలిపారన్నారు. దీంతో జయలింగారెడ్డి తాము పిల్లతనం నుంచి చూస్తున్న కాలువను.. కాలువ కాదు పట్టా భూమి అని చెప్పి వారికి ప్లాను ఇచ్చారు కదా.. డాక్యుమెంట్లు ఉన్నాయా అని ప్రశ్నించినట్లు తెలిపారు. 1991 నాటి డాక్యుమెంట్లు స్థలానికి ఉన్నాయని ఏసీపీ తెలిపారన్నారు. లింకు డాక్యుమెంట్లు వున్నాయా అని ప్రశ్నిస్తే లేవని సమాధానం చెప్పారని తెలిపారు. దీంతో మాది మున్సిపల్ కార్యాలయం పక్కన స్థలం వుందని.. ఆ స్థలానికి డాక్యుమెంట్లు ఉన్నాయని.. లింక్ డాక్యుమెంట్లు లేవని మరి ఆ స్థలానికి మీరు ప్లాను ఇవ్వలేదు కదా అని ప్రశ్నించారు. ఏసీపీకి ఇష్టమైన వాళ్లకు ప్లాన్లు ఇస్తారని.. ఇష్టం లేకుంటే సాకులు చెబుతారన్నారు. మున్సిపల్ సర్వేయర్‌తో సర్వే చేయించి అక్కడ రికార్డు ప్రకారం కాలువ వుందా లేదని తేల్చుతామని కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. ఆమేరకు కౌన్సిలర్ సరిత, ఆమె భర్తకు చెప్పి పంపించారన్నారు. అంతే తప్ప ఎలాంటి దౌర్జన్యం దాడి లాంటి యత్నాలు పూర్తిగా అవాస్తమన్నారు.

కొండగంగమ్మకు వెండి ఆభరణాలు వితరణ



వెండి తొడుగులతో ఉన్న కొండగంగమ్మ అమ్మవారు

పెండ్లిమర్రి, ఆగస్టు 13: మండలంలోని నందిమండలం సమీపంలోని కొండపై వెలసిన కొండగంగమ్మ అమ్మవారికి వెండి ఆభరణాలు వితరణగా అందజేశారు. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఏసీ గంగయ్య తన కుటుంబ సభ్యులతో కలసి ఈఓ మారుతీ ప్రసాద్‌కు అందజేశారు. రూ.2లక్షల విలువైన 1.986 కేజీల వెండితో తయారుచేసిన వెండి కవచం, పాదాలు, హస్తాలు అమ్మవారికి కానుకగా అందించారు. అలా గే అమ్మవారి గుడి వెనుక భక్తుల కోసం రూ.4.50 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించినట్లు ఈఓ తెలిపారు.


గ్రంథాలయాలు.. సరస్వతీ నిలయాలు



గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న డైరెక్టర్, తదితరులు

వేంపల్లె, ఆగస్టు 12: గ్రంథాలయాలు సర్వతీ దేవి నిలయాలు, విజ్ఞాన బండాగారాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త అన్నారు. సోమవారం ట్రిపుల్‌ఐటీలో గ్రంథాలయాధికారి కోనప్ప ఆద్వర్యంలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భగా డైరెక్టర్ మాట్లాడుతూ సమయాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదివి మరింత విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలను గుర్తుచేశారు. అనంతరం గ్రంథాలయ అధికారి కోనప్పను శాలువ కప్పి మెమెంటో అందించి సత్కరించారు.

గ్రీవెన్స్ సెల్‌లో చేనేత వస్త్రాల కళకళ



గ్రీవెన్స్‌హాల్‌కు చేనేత వస్త్రాలతో వచ్చిన అధికారులు

కడప(కలెక్టరేట్) ఆగస్టు 12: చేనేతలకు భరోసా కల్పించి వారు చేసే ఉత్పత్తులను ప్రతి సోమవారం ప్రభుత్వ ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా వాడేలా గత వారం కలెక్టర్ శివశంకర్ ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదికలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో పాటు అధికారులు, మహిళా అధికారిణిలు చేనేత వస్త్రాలు ధరించి హాజరు కావడంతో గ్రీవెన్స్‌సెల్ కార్యాలయం కళకళ లాడింది. కాగా కొందరు అధికారులు మాత్రం చేనేత వస్త్రాలు ధరించకుండా పాత పద్ధతి లోనే కనిపించడం గమనార్హం. చేనేతలను ప్రోత్సహించేలా అధికారులు మరింత చొరవ తీసుకొని కలెక్టర్ ఆదేశాలు తూచా పాటిస్తే, వారి బాటలో మిగతా ఉద్యోగులు కూడా చేనేత ఉత్పత్తులను వాడడమే కాకుండా.. అందరికీ ఆదర్శంగా నిలుస్తారు.

21న ఉపముఖ్యమంత్రి రాక..

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 12: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లెలో నిర్వహించే గ్రామ సభకు ఈ నెల 21వ తేదీ హాజరు అవుతున్నారని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రకటనలో తెలిపారు.

ఎంపీడీవోగా సూర్యనారాయణరెడ్డి



రామాపురం, ఆగస్టు 12: మండల అభివృద్ధి అధికారిగా సూర్యనారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు ఇక్కడ పని చేసిన ప్రభాకర్ అనంతపురం జిల్లాకు వెళ్లిపోవడంతో, కర్నూలు జిల్లా చాగలమర్రి ఎంపీడీవోగా పనిచేస్తున్న సూర్యనారాయణరెడ్డిని ఇక్కడకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తమ దృష్టికి వస్తే పరిష్కరిస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

గ్రామాల అభివృద్ధికి ప్రతి సర్పంచ్, ఆయా గ్రామాల కార్యదర్శులు సహకరించాలని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉషారాణి, గ్రామ సర్పంచుల సంఘం అధ్యక్షుడు అయోధ్యాపురం నాగభూషణ్‌రెడ్డి, మున్నీర్, ధనలక్ష్మి, సరోజమ్మ, రత్నమ్మ, ఆంజనేయులు, వెంకటరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.


నల్లపురెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మృతి

పెనగలూరు, ఆగస్టు 12: మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ మాజీ సర్పంచ్ బండి సానారెడ్డి(86) వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన 2015లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందారు. అప్పటి నుంచి ఐదేళ్లపాటు నల్లపురెడ్డిపల్లె సర్పంచ్‌గా పనిచేసి బెస్తపల్లె, ముండ్లావారిపల్లె, బుట్టిరెడ్డిగారిపల్లె, నడింపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● సీఎంను కోరిన మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, ఆగస్టు 12: రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడును రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాకాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి గ్రామీణ రహదారులు, జాతీయ రహదారులు, తాగునీరు, సాగునీరు, రాయచోటి పట్టణ అభివృద్ధి తదితర అంశాలపై చంద్రబాబుతో ప్రత్యేక సమావేశమై పలు అంశాల గురించి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రాయచోటి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, త్వరగా రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు వేసి నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో అన్ని మౌలిక వసతులు కల్పించి నియోజకవర్గాన్ని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దేందుకు తమకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

ఎంపీడీవోగా సునీల్‌కుమార్



సంబేపల్లె, ఆగస్టు 12: సంబేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సునీల్‌కుమార్ సోమవారం అదనపు బాధ్యతలను చేపట్టారు. ఈయన సంబేపల్లె మండల పంచాయతీరాజ్ ఈవోపీఆర్డీగా పనిచేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అనంతపురం జిల్లా నుంచి వచ్చిన నిర్మలాదేవి ఇక్కడి నుంచి తిరిగి అనంతపురానికి బదిలీ కావడంతో ఇక్కడ పనిచేస్తున్న సునీల్‌కుమార్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.

పెనగలూరు ఎంపీడీవోగా వరప్రసాద్

పెనగలూరు, ఆగస్టు 12: పెనగలూరు ఎంపీడీఓగా సోమవారం పి.వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. గతంలో పెనగలూరు ఎంపీడీవోగా పనిచేస్తూ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గత జనవరి నెలలో చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అయితే ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియ సడలించి గతంలో పనిచేసిన ఎంపీడీవోలు తిరిగి వారి స్థానాలకు వెళ్లాలని ఆదేశాలు ఇవ్వడంతో ఆయన చిత్తూరు జిల్లా నుంచి మరలా ఆరు నెలల తర్వాత ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

పంచాయతీల అభివృద్ధిపై సమావేశం

సంబేపల్లె, ఆగస్టు 12: గ్రామ పంచాయతీల ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలు తదితర అంశాలపై సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం మూడు రోజుల రీప్లేస్మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటి రోజున పారిశుధ్యం, వర్మీకంపోస్టు తయారీ, మార్కెట్‌లో విధి విధానాలు, ఎస్‌ఎస్సీ సభ్యుల భాగస్వామ్యం, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సునీల్‌కుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణ

చిన్నమండెం, ఆగస్టు 12: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు ఎంపీడీవో దివ్య, డీఎల్‌పీవో పార్వతమ్మల ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్యంగా ఎల్ఈడీ వీధి దీపాలు, స్వచ్, పారిశుధ్యం వాటి మీద సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, ఈవోఈఆర్డీ పవన్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటం మండల అభివృద్ధి సభాభవనంలో ఎంపీడీవో అధ్యక్షతన సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతి సర్పంచులకు, కార్యదర్శులకు మొదటిరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జవహర్‌బాబు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు సమష్టి కృషితో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి పులి రాంసింగ్, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే అమ్మకువందనం ఇవ్వాలి'

రైల్వేకోడూరు, ఆగస్టు 12: అమ్మకువందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే అమలు చేయాలని రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లెం హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అమ్మకు వందనం అమలు చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోయి పాఠశాలలు మూతపడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

నవోదయకు 9వ తరగతి విద్యార్థిని

సుండుపల్లె, ఆగస్టు 12: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పల్లం రుషశ్విని నవోదయకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయన్న తెలిపారు. రాజంపేటలోని నవోదయ విద్యాలయానికి ఎంట్రన్స్‌లో చక్కని ప్రతిభ కనబర్చి ఎంపిక కావడం పట్ల విద్యార్థినీని ఉపాధ్యాయులు అభినందించారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకట్రమణ, హరికుమార్, అబూబకర్, దేవలా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సర్పంచులు కీలకపాత్ర పోషించాలి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 12: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కీలక పాత్ర పోషించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎస్ఐఆర్డీ పీఆర్(విజయవాడ) వారి ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సర్పంచు విధులు, ఆవశ్యకత గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలోని వీధిలైట్లు, పారిశుధ్యం, గ్రామంలోని డ్రైనేజి సమస్యల గురించి అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలోని సమస్యలు గుర్తించి వాటి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పట్నాయక్, ఏఓ గురుప్రసాదు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

● ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రైల్వేకోడూరు, ఆగస్టు 12: విద్యార్థుల సమస్యలపై నిరంతరాయంగా పోరాటాలు సాగిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు జూనియర్ కళాశాల ఆవరణంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, సహాయ కార్యదర్శి వినయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు ప్రసాద్, డీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి తేజ, నాయకులు రాజ, నవదీప్, వీరేంద్ర, బాలేశ్వర్, మంజునాథ్, గాయత్రి, మానస, పూజ, మయూరి పాల్గొన్నారు.

దీక్షతో లక్ష్యాన్ని సాధించాలి: రమేష్‌నాయుడు

రాజంపేట, ఆగస్టు 12: అకుంఠిత దీక్షతోనే ఎవరైనా లక్ష్యాన్ని సాధించగలమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు అన్నారు. రాజంపేట ద్రోణాచార్య మాస్టర్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారుడు దక్షిణభారత జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన సందర్భంగా సోమవారం జీఎంసీ క్లబ్‌లో క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రమేష్‌నాయుడు పాల్గొని క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లతో పాటు జట్టుకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కప్‌ను కూడా అందించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడల్లో రాణించాలంటే క్రీడాకారులకు ఓర్పు, పట్టుదల, కృషి ఉండాలన్నారు. అనంతరం అకాడమీ గ్రాండ్‌మాస్టర్ సునీల్ మాట్లాడారు. ఈ నెల 10, 11 తేదీల్లో తిరుపతిలో జరిగిన దక్షిణ భరత జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో తమ అకాడమీ నుంచి 8 మంది క్రీడాకారులు పాల్గొని అందరూ పతకాలు సాధించినట్లు తెలిపారు.

ఘనంగా ముత్తుమారమ్మ తల్లికి పాలపూజ

నందలూరు, ఆగస్టు 12: మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన ముత్తుమారమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు అయిన సోమవారం సాయంత్రం అమ్మవారికి పాలపూజ అత్యంత ఘనంగా జరిగింది. అర్చకులు నాగరాజస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాలపూజ కార్యక్రమంలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దివంగత శేలం సుబ్రమణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు శేలం సురేష్ బాబు, శేలం సుధాకర్‌లు గూడవారి సుజిత్‌కుమార్, వీరి ధర్మపత్ని శేలం రజనీలు భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌కిరణ్‌కుమార్, నాగరాజరావు, తిప్పాయపల్లె ప్రశాంత్, రెడ్డయ్య, మణి, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి పాలపూజ చేస్తున్న దృశ్యం

కస్తూర్బాలో చట్టాల గురించి అవగాహన

● సివిల్ జడ్జి ఆసిఫా సుల్తాన్

సుండుపల్లె, ఆగస్టు 12: విద్యార్థినీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జడ్జి ఆసిఫా సుల్తాన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినీలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినీలకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. అనంతరం వంటగదిని, తరగతి గదులను, పాఠశాల ఆవరణాన్ని చూశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సామర్థ్యాల అంచనాకే బేస్‌లైన్ పరీక్షలు

సంబేపల్లె, ఆగస్టు 12: సీబీఎస్‌సీ పరీక్షలు రాయబోతున్న పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రభుత్వం బేస్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తోందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి పదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా సోమవారం ఇంగ్లీష్ పరీక్షను నిర్వహించారు. 50 మార్కులకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నారని, తమ పాఠశాల నుంచి 74 మంది విద్యార్థులు బేస్‌లైన్ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి

సంబేపల్లె, ఆగస్టు 12: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కలెక్టర్, డీఈవోల ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

రైల్వేకోడూరు, ఆగస్టు 12: స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాధరాజు గంగాధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రైల్వేకోడూరు రెవెన్యూశాఖ కార్యాలయంలో స్కీం వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా స్కీం వర్కర్లను తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, స్కూలు స్వీపర్లు తదితర కార్మికులను గ్రామాల్లో రాజకీయ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ రెడ్డిప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

రాజంపేట, ఆగస్టు 12: రైతులు సాగుచేసిన ఉద్యాన పంటల వివరాలను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రాజంపేట ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు తెలియజేశారు. సోమవారం పోలి, ఊటుకూరు రైతుసేవా కేంద్రాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన అరటి, బొప్పాయి, నిమ్మ, రోజాపూలు, మామిడి ఇతర ఉద్యాన పంటల సాగు వివరాలను నమోదు చేసే ఈ-పంట ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో పూర్ణచంద్ర, వీహెచ్ఏ చెంగల్‌రాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చదువులో పోటీతత్వం అలవర్చుకోవాలి

సంబేపల్లె, ఆగస్టు 12: విద్యార్థులు చదువులో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి ఎస్.కృష్ణన్‌కుట్టి తెలిపారు. సోమవారం సంబేపల్లె రాయచోటి కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాలను పరిశీలించారు. రాయచోటి హాస్టల్‌లోనే స్టోర్ రూమ్, వంటగది, హాస్టల్ గదులను పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో ఏవైనా సమస్యలుంటే తెలియజేయమని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని బంగారు భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని తెలియజేశారు.

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 12: పట్టణంలో వెలిసియున్న భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి ఆలయ మాఢవీధుల్లో బ్యాండు మేళాలు, కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నడ భక్తులతో పాటు భక్తులు పల్లకీ ఉత్సవంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడిని దర్శించుకుని మంగళహారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు పల్లకీ ఉత్సవం విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వీరభద్రాలయంలో అన్నదానం : పట్టణంలోని దక్షిణకాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో భక్తుల సౌకర్యార్థం శ్రావణ సోమవారం సందర్భంగా శ్రీవెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వారు భక్తులతో పాటు పట్టణ ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్

● లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జీ ఫైజున్నిసా



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జీ ఫైజున్నిసా

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 12: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, అప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని లక్కిరెడ్డిపల్లె కోర్టు సివిల్ జడ్జీ షేక్ ఫైజున్నిసా పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర లీగల్ అథారిటీ వారి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, కిచెన్, క్లాస్ గదులు, అన్ని వసతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యసూత్రాలు పాటించాలని సూచించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కస్తూర్బా బాలికల విద్యాలయంలో ప్రభుత్వం అన్ని వసతులు ఏర్పాటు చేసిందని, కష్టపడి చదువుకొని మంచి భవిష్యత్ ఎంచుకోవాలన్నారు. చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి

రామాపురం, ఆగస్టు 12: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్‌జడ్జి ఎస్‌కే ఫైజున్నీషా సోమవారం రామాపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని, తరగతి, వంట గదులను పరిశీలించారు. పిల్లలకు నివాసయోగ్యంగా ఉన్నాయా లేవా అని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపల్ పుష్పలత, ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు ఉన్న సౌకర్యాల గురించి ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కోర్టు కానిస్టేబుల్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 12: జిల్లాలో గత ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద సీపీఐ అనుబంధ సంఘాలతో కలసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, విశ్వనాధనాయక్, సుధీర్, శ్రీనివాసులు, బాధితులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి ప్రమాదకరం: ఏఐఎస్ఎఫ్

రాయచోటిటౌన్, ఆగస్టు 12: నూతన జాతీయ విద్యా విధానం ప్రమాదకరంగా మారిందని, ప్రభుత్వ విద్య పరిరక్షణకై విద్యార్థులు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

రైల్వేకోడూరు, ఆగస్టు 12: రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేసేందుకే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అమలు చేసిందని రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిప్రసాద్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పలు రెవెన్యూ సమస్యలపై ప్రజలు, రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

'ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు చేపట్టండి'

రాజంపేటటౌన్, ఆగస్టు 12: పాఠశాలకు ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల ద్వారా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిపై రవాణాశాఖ యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చిన్నఓరంపాడు దగ్గర గల స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా చిన్నారి మృతి చెందిందని, ఎంవీఐ అధికారులు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ లేకుండా రెన్యూవల్ చేయడం, పాత స్కూల్ బస్సులకు ఎటువంటి సేఫ్టీ సైడ్ వాల్స్ లేకపోవడం, పరిమితికి మించి ఎక్కిస్తున్నా రవాణాశాఖ అధికారులు తనిఖీ చేయకపోవడమే కారణమన్నారు. మృతిచెందిన బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

క్రమశిక్షణతో చక్కటి విద్యను అభ్యసించాలి

రాజంపేటటౌన్, ఆగస్టు 12: క్రమశిక్షణతో విద్యార్థులు చక్కటి విద్యను అభ్యసించి తమ భవిష్యత్తు ఉజ్వలంగా మలచుకోవాలని బీజేపీ రాష్ట్ర నేత నాగోతు రమేష్ నాయుడు తెలిపారు. సోమవారం రాజంపేట పట్టణంలోని వైబీఎన్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు తిథి భోజనం నిర్వహించారు. ఎం.సురేష్‌నాయుడు, కుమారుడు సాయిశబరీష్ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలోని విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రమేష్‌నాయుడు, వేణుగోపాల్‌లు హాజరయ్యారు. సహోపాధ్యాయుని కేఎస్ పూర్ణిమ, అంగన్వాడీ వర్కర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

మా భూమి మాకు ఇప్పించండి మహాప్రభో

● అధికారులను వేడుకుంటున్న చెన్నరాజుపోడు గ్రామ నివాసి

రాయచోటిటౌన్, ఆగస్టు 12: ఆక్రమణకు గురైన ఒక ఎకరా 78 సెంట్ల భూమిని తమకు ఇప్పించండి మహాప్రభో అంటూ ఓబులవారిపల్లె మండలం చెన్నరాజుపోడు గ్రామ నివాసి పత్తి సుబ్బరాయుడు జిల్లా ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. సోమవారం ఆయన జిల్లా స్థాయి ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో విలేకరులతో మాట్లాడారు. గత 30 ఏళ్లుగా తమకు ఉన్న 30 ఎకరాల భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగించే వారమని, సర్వేనెంబర్లు 904, 1/1, 1613, 1614, 1616లలో ఈ భూమి ఉందన్నారు. ఇందులో తనకు సంబంధించిన ఒక ఎకరా 70 సెంట్లు భూమిని అక్రమంగా ఆక్రమించినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నానని చెప్పారు.

జీవో 117 రద్దు చేయాలని నిరసన

పుల్లంపేట, ఆగస్టు 12: జీవో నంబరు 117ను రద్దు చేసి జీవో నంబరు 53 అమలు చేయాలని సోమవారం ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావులకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్ర విద్యాశాఖ ఏకపక్షంగా అత్యవసరంగా చేపట్టడం దారుణమన్నారు. పుల్లంపేటలోని ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు నరేంద్రనాథ్, రమణయ్య, సర్తాజ్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వేధించి..హత్యకు గురయ్యాడు


హతుడు మొగిలీశ్వర (ఫైల్ ఫొటో)


పలమనేరు ఆగస్టు 12: సామాజిక కట్టుబాట్లకు విలువ ఇవ్వని బంధాలు చివరికి విషాదాంతమవు తాయని మొగిలీశ్వరయ్య హత్య ఘటన మరోసారి వెల్లడిస్తోంది. పలమనేరు లక్ష్మీనగర్ కాలనీలో సహ జీవనం చేస్తున్న స్త్రీని వేధిస్తూ ఆమె చేతిలోనే కత్తిపోట్లకు గురై మొగిలీశ్వరయ్య కన్నుమూశాడు. అరగొండ సమీపంలోని వెంగంపల్లికి చెందిన మొగిలీశ్వరయ్యకు పలమనేరు పల్లివీధిలోని యువతితో పెళ్లయింది. ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు ఉన్నారు. మేస్త్రీ పనిచేసే ఇతను గంగవరం మండలం యామనపల్లికి చెందిన మంగమ్మ అనే వివాహితకు దగ్గరయ్యాడు. ఆమెకు కూడా ఇద్దరు పిల్లలున్నారు. మొగిలీశ్వరయ్య, మంగమ్మ నాలుగేళ్లుగా పలమనేరు లక్ష్మీనగర్‌కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం సాగిస్తు న్నారు. తరచూ తాగి వచ్చి మంగమ్మతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం అర్ధరాత్రి కూడా వీరి మధ్య గొడవ జరిగింది. మంగమ్మను మొగిలీశ్వరయ్య కొట్టాడు. దీంతో ఆమె చాకుతో మొగిలీశ్వరయ్యను పొడిచింది. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి జరిగిందంతా చెప్పింది. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకునేప్పటికే మొగిలీశ్వరయ్య రక్తపుమడుగులో విగత జీవుడై పడి ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేటి నుంచి కడపలో స్టాఫ్‌నర్సు కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్, ఆగస్టు 12: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా పనిచేసేందుకు మెరిట్ ఆధారంగా ఎంపికైన 206 మందికి మంగళవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు కడప ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుందని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ తేదీలను www.hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆయా తేదీఈల్లో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9440290777, 93819050378లను సంప్రదించాలని తెలిపారు.

షార్ వేదికగా నేడు అంతరిక్ష దినోత్సవాలు

● హాజరు కానున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్


షార్ కేంద్రం

సూళ్లూరుపేట, ఆగస్టు 12: ఈనెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నెల రోజులపాటు భారత ప్రభుత్వం, ఇస్రో, షార్ సంయుక్త ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్ర ప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని ఒఆర్ కురుప్ ఆడిటోరియంలో అంతరిక్ష దినోత్సవాలను నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే ఈ వేడుకల్లో పాల్గొంటారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్‌తోపాటు రాకెట్ ప్రయోగవేదికలను, స్పేస్ మ్యూజియాన్ని పవన్‌కల్యాణ్ సందర్శించనున్నారు.

యూపీలో అదృశ్యమైన స్వామీజీ

శ్రీకాళహస్తిలో ప్రత్యక్షం


గురు సరా నందాజీ మహరాజ్

శ్రీకాళహస్తి,ఆగస్టు12:ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గురు సరా నందాజీ మహరాజ్ స్వామి శ్రీకాళహస్తిలో ప్రత్యక్షమయ్యాడు. తిరుపతి జిల్లాలో ఆయన కదలికలు ఉన్నాయన్న అనుమానంతో పోలీసు యంత్రాంగం రెండురోజులుగా గాలింపు చేపట్టింది. శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో సోమవారం ఆయన ఉన్నట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గురు సరా నందాజీమహరాజ్‌స్వామి కొద్దిరోజుల క్రితం ఆయన ఆవాసం ఉండే ఆశ్రమం నుంచి అదృశ్యమయ్యాడు.అత్యంత ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్న ఆయన కోసం కొద్దిరోజులుగా వెతుకులాట జరిగింది. తిరుపతి జిల్లా పరిధిలో స్వామిజీ కదలికలు ఉన్నట్లు పోలీసుశాఖ అధికారులకు సమాచారం వచ్చింది. రెండురోజుల పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పలు పోలీసు ప్రత్యేక బృందాలతోపాటు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది గాలించారు. ఎట్టకేలకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే నరేష్ అనే కానిస్టేబుల్ పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో స్వామిజీని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. తిరుపతి నుంచి ప్రత్యేక బృందం శుకబ్రహ్మాశ్రమానికి చేరుకుని ఆయనను విమానాశ్రయానికి తరలించి అక్కడి నుంచి యూపీకి పంపారు.

17న జిల్లాకు ఉప రాష్ట్రపతి దంపతుల రాక

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ దంపతులు ఈనెల 17వ తేదీన జిల్లాకు విచ్చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో జరగనున్న 23వ వార్షిక స్వర్ణభారత్ ట్రస్టు ఉత్సవాల్లో పాల్గొననున్నారు. 17న ఉదయం 8.35గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాయుసేన విమానంలో బయల్దేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.50గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాయుసేన హెలికాప్టర్‌లో బయల్దేరి నెల్లూరులోని పోలీస్‌గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వెంకటాచలంలోని అక్షర విద్యాకేంద్రానికి వెళతారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శిస్తారు. ఉదయం 11.50గంటలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో కలిసి 23వ స్వర్ణభారత్ ట్రస్టు ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు నెల్లూరు పోలీస్ గ్రౌండ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. 3.45గంటలకు ప్రత్యేక వాయుసేన విమానంలో తిరుపతి విమానాశ్రయంనుంచి ఢిల్లీ బయల్దేరి వెళతారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం ఒకరోజు వాయిదా

సూళ్లూరుపేట, ఆగస్టు 12 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ నుంచి ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం ఒక రోజు వాయిదా పడింది.ఈ నెల 16న ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ద్వారా ఈవోఎస్-08 భూ పరిశీలన ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు.ఇస్రో అధికారులు తొలుత ఈ ప్రయోగాన్ని ఆగస్టు 15న ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేశారు. షార్‌లో ఆగస్టు 13న అంతరిక్ష దినోత్సవాలు, 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉండడంతో ప్రయోగాన్ని ఒకరోజు వాయిదా వేసినట్లు ఇస్రో వర్గాల సమాచారం. ఆగస్టు 16న ఉదయం 9.17 గంటలకు షార్ నుంచి ఇస్రో రూపొందించిన మూడో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం చేపట్టనున్నారు. రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం చేశారు. ఉపగ్రహం చుట్టూ ఉష్ణకవచం అమర్చి తుది పరీక్షలను పూర్తిచేశారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ మంగళవారం షార్‌లో ప్రయోగంపై శాస్త్రవేత్తలతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

హథీరాంజీ మఠం ఇన్‌చార్జి ఏవోగా రామారావు



తిరుపతి అర్బన్, ఆగస్టు 12: హథీరాంజీ మఠం ఇన్‌చార్జి పరిపాలన అధికారి (ఏవో)గా ఈవో కె.ఎస్.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఉన్న ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడిని ప్రభుత్వం మాతృసంస్థకు బదిలీ చేసింది. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవోగా ఉన్న రామారావుకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా మఠం అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. అనంతరం మొండి బకాయిల వసూళ్లపై ఇన్‌చార్జి ఏవో ఆదేశాలిచ్చారు. దాంతో ఏఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొన్ని దుకాణాల నుంచి వసూలు చేయగా, మిగిలిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. మఠం సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, గంగాధరం, మణిభూషణ్‌రావు, శ్రీనివాసులు, రాము, నరసింహాచార్యులు, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 86,604 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,536 మంది తలనీలాలు సమర్పించారు.

కలెక్టరేట్‌కు 200... పోలీసుశాఖకు 50 అర్జీలు

చిత్తూరు, ఆగస్టు12: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో అధికారులతోకలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు. బాధితుల సమస్యలను విని పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. మరికొన్ని సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు వినతులను స్వీకరించారు. నిర్ణీత సమయంలోగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని....

● యానాది కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పెనుమూరు మండలం కల్వకుంట పంచాయతీ ఎస్టీకాలనీ వాసులు కోరారు.

● 35 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీ ఇళ్లల్లో నివాసముంటున్నామని, ఆ ఇళ్లన్నీ ఇప్పుడు వర్షాలు వస్తే ఉరుస్తున్నాయని యాదమరి మండలం కీనాటంపల్లె పంచాయతీ షికారీ కాలనీ వాసులు తెలిపారు. షికారీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎన్టీయార్ గృహ నిర్మాణ పథకం ద్వారా కొత్తగా ఇళ్లను కట్టివ్వాలని కోరారు.

● సంఘమిత్ర సుజాత చేసిన అవినీతి అక్రమాలను ప్రశ్నించినందుకు తమను గ్రూపు నుంచి తొలగించారని నింద్ర మండలం పాదిరి గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘ సభ్యురాలు ద్రాక్షాయణి ఫిర్యాదు చేశారు. తాను గ్రూపులో మొదటి లీడర్‌గా ఉన్నానని, తనకు తెలియకుండానే సుజాత బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో డబ్బులను డ్రా చేసి స్వాహా చేసిందన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి సుజాతపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

● తమ జీవనాధారమైన భూములను సర్వే చేసి అప్పగించాలని చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లెకు చెందిన ఓ దళిత కుటుంబం వాపోయింది. తమ ఉమ్మడి వ్యవసాయ భూమి చిత్తూరు, యాదమరి మండలాల సరిహద్దులో ఉన్నాయని తెలిపారు. తమ కుటుంబానికి చెందిన వనమ్మ చదువుకోలేదని, ఆమె సంతకం చేసినట్లుగా ఫోర్జరీ పత్రాల్ని సృష్టించారని ఆరోపించారు. ఎకరం భూమి ఆక్రమణకు గురై అక్కడే ఉన్న పరిశ్రమ అనుభవంలో చేరిందన్నారు. రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని సాలమ్మ, తదితరులు కోరారు.

● కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 200 మంది అర్జీదారులు హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. వాటిలో రెవెన్యూశాఖకు 166, నేషనల్ హైవేకకు 06, సర్వేశాఖకు 03, మిగిలిన డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, పంచాయతీరాజ్, అటవీశాఖ తదితర శాఖలకు సంబంధించి 25 అర్జీలందాయి. జేసీ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

● పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి 50 మంది అర్జీదారులు హాజరయ్యారు. ఇందులో భూ తగాదాల కింద 17, డబ్బు తగాదాలు 07, ఆస్తి తగాదాలు 06, వేధింపులు 05, భర్త వేధింపులు 02, బైక్‌చోరీ 02, చీటింగ్, ఇంటి తగాదాలు, దారి సమస్యల కింద ఒక్కో అర్జీవంతున అందాయి.


అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

నా భూమి నాకు ఇప్పించండి

ఆర్డీవో గ్రీవెన్స్‌కు 19 అర్జీలు

చిత్తూరు రూరల్, ఆగస్టు 12: 'నా భూమిని నాకు తెలియకుండా మా అన్న తన పేరుతో రాసుకున్నాడని, ఇప్పించాలని బంగారుపాళ్యం మండలం మొగిలి వెంకటగిరి గ్రామానికి చెందిన జగదీశ్వరన్ చిత్తూరు ఆర్డీవో చిన్నయ్యను వేడుకున్నాడు. ఈ మేరకు సోమవారం చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో వినతిపత్రం అందజేశాడు. గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి గ్రామంలో సర్వే నెం.76/1లో 2.24 ఎకరాలను అన్న నగరాజన్‌తో కలిసి కొనుగోలు చేశామన్నారు. ఇద్దరం కలిసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, అయితే తనకు తెలియకుండా తన అన్న మొత్తం భూమిని తన పేరుతో పట్టాదారు పుస్తకం చేయించుకున్నాడని తెలిపారు. దీనిపై అప్పటి తహసీల్దార్‌ను అడిగినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. న్యాయం చేయాలని కోరాడు.

● రేషన్ సరుకులు సరిగా ఇవ్వడం లేదు

పూతలపట్టులోని ఒక రేషన్ షాపులో మూడు రోజులకు మించి రేషన్ సరుకులు ఇవ్వడం లేదని కార్డుదారులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. తర్వాత వెళ్లే వారికి సరుకులు అయిపోయాయని చెబుతున్నారని తెలిపారు. ప్రతినెలా ఇదే తంతుగా మారిందని, డీలర్‌పై చర్యలు తీసుకుని తమకు సరుకులు ఇప్పించాలని కోరారు.

● పొలానికి దారి కల్పించండి

తమ పొలానికి దారి లేకుండా ప్రభుత్వ భూమిలో మామిడి చెట్లు నాటుకుంటున్నాడని, న్యాయం చేయాలని వెదురుకుప్పం మండలం మాకమాంబాపురానికి చెందిన చెంగల్రాయరెడ్డి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వేనెంబరు 187/1, 186/1, 185/1, 184/4,6 లో పశువుల మేత పొరంబోకు, బండిబాట, కాలువ పొరంబోకు, కుంట ఉన్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన హరిఓమ్ ఆ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నాడని, గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా నిలిపేసి, ఇప్పుడు ఏకంగా మామిడి మొక్కలు నాటుతున్నాడని తెలిపారు. కాగా గ్రీవెన్స్‌డకు మొత్తం 19 అర్జీలు వస్తే అన్నీ భూ సమస్యలకు సంబంధించిన అర్జీలే వచ్చాయని ఆర్డీవో చిన్నయ్య తెలిపారు.


దారి కల్పించాలని కోరుతున్న చెంగల్రాయరెడ్డి కుటుంబ సభ్యులు

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12: ఈనెల 16 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు 45 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న సదస్సుల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జేసీ శ్రీనివాసులుతో కలిసి తహసీల్దార్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులో మండల సర్వేయర్, దేవాదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీశాఖ అధికారులు పాల్గొనాలన్నారు. ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ నియామకంతో పాటు ఆర్డీవోలు వారి రెవెన్యూ డివిజన్ల పరిధిలో జరిగే సదస్సులను పర్యవేక్షించాలన్నారు. పెద్ద డివిజన్లలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను కూడా పర్యవేక్షణకు నియమించాలని డీఆర్వోను ఆదేశించారు. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.


తహసీల్దార్లకు సూచనలిస్తున్న కలెక్టర్

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

విషాదంలో కుటుంబీకులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 12 : మండలంలోని గొల్లచీమనపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నవీన్‌కుమార్ (32) గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వ్యవసాయ కుటుంబానికి చెందిన రాజారెడ్డి కుమారుడు నవీన్‌కుమార్ హర్యానాలో ఏడేళ్లుగా ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నాడు. సెలవులపై నెల రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి మూడు రోజులకు ముందు హర్యానాకు వెళ్లారు. ఢిల్లీ నుంచి ఆదివారం బస్సులో హర్యానాకు వెళుతుండగా గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు కుటుంబీలకు సమాచారం అందింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. నవీన్‌కుమార్ భౌతికకాయానికి హర్యానాలో అక్కడి ఆర్మీ అధికారులు అధికార లాంఛనాలతో నివాళులర్పించారు. భౌతికకాయాన్ని మంగళవారం ఉదయం గొల్లచీమనపల్లెకు తీసుకువస్తారని, అదే రోజు అంత్యక్రియలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.


నవీన్‌కుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్మీ అధికారులు(ఇన్‌సెట్‌లో)నవీన్‌కుమార్ (ఫైల్ ఫొటో)

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.51.09 లక్షల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

తిరుమల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహణలోని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.51.09 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌లోని పునర్నవ ఆయుర్వేద కంపెనీకి చెందిన బొమ్మ వెంకటేశ్వరరెడ్డి ఈ విరాళపు మొత్తాన్ని చెక్ రూపంలో తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

చోరీ కేసులో బాలుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12: దొంగతనం కేసులో 17యేళ్ల బాలుడికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ జువైనల్ జస్టిస్ బోర్డు తీర్పు చెప్పింది.చిత్తూరుకు చెందిన ఓ బాలుడు గతేడాది తిరుపతి రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిలో దొంగతనం చేసి దొరికిపోయాడు.కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. దాదాపు ఏడాదిపాటు సాగిన ఈ కేసులో దోషికి సంవత్సరంపాటు సాధారణ జైలు విధిస్తూ తీర్పు చెప్పారు.

అడవుల పరిరక్షణతో ఏనుగుల సంరక్షణ

ఘనంగా వరల్డ్ ఎలిఫెంట్ డే

కుప్పం/రామకుప్పం, ఆగస్టు 12: అడవులను పరిరక్షించడం ద్వారా ఏనుగుల సంరక్షణ సాధ్యమవుతుందని కడా ప్రాజెక్టు ఆఫీసర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కుప్పంలో సోమవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఏనుగులు సాధు జంతువులని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. రామకుప్పం మండల పరిధిలోని ముద్దనపల్లె ఉన్నత పాఠశాల ఆవరణలో రామకుప్పం అటవీ డిప్యూటీ రేంజ్ అధికారి ధనుంజయుడు అటవీ సిబ్బంది, టీడీపీ నేతలతో కలిసి మొక్కలు నాటారు. ననియాల కౌండిన్య ఎలిఫెంట్ క్యాంపులో కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్‌లకు స్నానపానాదులు చేయించి, ప్రత్యేక రంగులతో అలంకరించారు. వాటికి పూజలు చేసి, పండ్లు, ఫలహారాలు అందజేశారు. అటవీ సిబ్బంది ననియాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏనుగుల కదలికలు, ఏనుగుల దాడి నుంచి తప్పించుకునే మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎఫ్ఆర్‌వో జయశంకర్‌తోపాటు డీఆర్వోలు, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, బీసీసెల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మనోహర్, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, సీనియర్ నేతలు రామ్మూర్తి, జేయి, రఘు, నందీశ్వర్, నాగరాజు, సుబ్రహ్మణ్యంనాయుడు, మంజునాథ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.


జయంత్, వినాయక్‌తో ననియాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 33వ ర్యాంకు

వెటర్నరీ వర్సిటీల కేటగిరీల్లో 4వ స్థానం ● ర్యాంకులను విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్



తిరుపతి రూరల్, ఆగస్టు 12: దేశంలోని వ్యవసాయ అనుబంధ రంగాల (అగ్రికల్చరల్ అండ్ అలైడ్ సెక్టార్స్) వర్సిటీలకు 2024 సంవత్సరానికి భారత ప్రభుత్వ నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ సంస్థ (ఎన్ఐఆర్ఎఫ్) సోమవారం ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఇందులో తిరుపతి కేంద్రంగా నడిచే ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 33వ ర్యాంకు లభించింది. 74 వ్యవసాయ అనుబంధ రంగాల వర్సిటీలకు ఈ ర్యాంకులను ప్రకటించగా 46.41 స్కోరుతో 33వ ర్యాంకును కైవసం చేసుకుందని వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య తెలిపారు. వెటర్నరీ వర్సిటీల కేటగిరీల్లో దేశంలో 4వ స్థానంలో నిలిచిందన్నారు. గత ఏడాది వర్సిటీ 31వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 33కు పరిమితమైందన్నారు. వర్సిటీల కేటగిరీలో మాత్రం గత ఏడాది లాగే ఈ సారి కూడా నాల్గవ స్థానాన్ని సాధించిందని వివరించారు. ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ మాట్లాడుతూ.. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ సాధించిన పురోగతికితోడుగా అధ్యాపకులు, ఉద్యోగుల సమన్వయంతో పనిచేయడం వల్ల ఉత్తమ స్థానాన్ని సాధించగలిగామన్నారు. ఇకపై కూడా సమష్టిగా పనిచేసి రానున్న ఏడాదిలో మెరుగైన స్థానాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇప్పటికే దేశంలోనే న్యాక్ గుర్తింపు పొందిన తొలి వెటర్నరీ వర్సిటీగా గుర్తింపు ఉందన్నారు. కాగా, ర్యాంకింగ్స్‌పై వర్సిటీ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

తిరుపతి-కాట్పాడి మధ్య ఆరురోజులపాటు రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 12: తిరుపతి - కాట్పాడి మధ్య ఆరు రోజులపాటు ప్రత్యేక రైళ్లు (07659-07582) రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా ఈనెల 13, 20, 25, సెప్టెంబరు 1, 8, 16 తేదీల్లో మధ్య పలు రైళ్ల రాకపోకలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి-విల్లుపురం మధ్య నడుస్తున్న రెగ్యులర్ రైళ్లు (16853-16854) కూడా తిరుపతి- కాట్పాడి మధ్య పైన తెలిపిన తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు. అలాగే కాట్పాడి- జోలార్‌పేట మధ్య ప్రత్యేక రైళ్ల(06417-06418)ను కూడా పైతేదీల్లో రద్దు చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఈ అసౌకర్యాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరిలో దేశభక్తి ఇనుమడింపజేయాలి

●ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ●అట్టహాసంగా స్వాతంత్ర్యదినోత్సవ సన్నాహాలు ● 8వేల మంది కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ



మదనపల్లె: అవెన్యూ రోడ్డులో ర్యాలీలో భారీగా తరలుతున్న విద్యార్థులు

పీలేరు: స్కూటర్ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి



మదనపల్లె టౌన్, ఆగస్టు 12: ప్రతి ఒక్కరిలో దేశభక్తి ఇనుమడింపజేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ సన్నాహాల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలో 8వేల మంది కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్య మాలకు పురిటిగడ్డగా చెప్పుకునే మదనపల్లెకు చరిత్రాత్మక నేపథ్యం ఉందని, ఈ విషయాన్ని భావి పౌరులకు తెలియజేసేందుకే ముందస్తు సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో దేశభక్తి నినాదాలు చేస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను చేతపట్టుకుని విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. అంబేడ్కర్ సర్కిల్, సీటీఎం రోడ్డు, టౌన్ బ్యాంకు సర్కిల్, అవెన్యూ రోడ్డు మీదుగా బీసెంట్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అనిబిసెంట్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు కళా శాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కరస్పాండెంట్లు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పీలేరు: పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలందరినీ ఏకం చేసి ఐక్యత భావాన్ని పెంపొందించడంలో త్రివర్ణ పతాకానికి కీలక పాత్ర అన్నారు. అనంతరం ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు తమ కళాశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహానికి, పంచాయతీ కార్యాలయ కూడలిలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ప్రైవేటు భూముల వివాదాలు కోర్టులో తేల్చుకోవాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఆగస్టు 12: ప్రైవేటు భూముల వివాదాలు ఏవైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని, కేవలం ప్రభుత్వ, డీకేటీ, అసైన్‌మెంట్ భూముల వివాదాలను తాము విచారించి న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి డివిజన్‌లోని 11 మండలాల నుంచి 87 మంది అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సీటీఎం గ్రామంలో తాము కొనుగోలు చేసిన భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారని ట్రాన్స్‌కో ఉద్యోగి ఏసువర్ధన్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు భూముల వివాదాలు కోర్టులో తేల్చుకోవాలని, రికార్డులు సక్రమంగా ఉండి ఎవరైనా దౌర్జన్యం చేస్తే పోలీసుల రక్షణ కోరాలని సూచించారు. మదనపల్లె మండలం మాలేపాడు గ్రామం దేవళంపల్లె వద్ద నిర్మించిన కొత్త సచివాలయ భవనాలు, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను కొంత మంది బలవంతంగా పాత స్కూలు భవనంలోని మార్చారని గ్రామస్థులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవతానగర్‌లోని సిరికల్చర్‌కు కేటాయించిన భూమిని కొందరు ఆక్రమించుకుని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని దేవతానగర్ ప్రజలు ఫిర్యాదు చేశారు.



సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రాలు ఇస్తున్న అర్జీలు

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పీలేరు, ఆగస్టు 12: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ యుగంధర్ పీలేరు పట్టణంలోని ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. సోమవారం ఆయన పీలేరు పట్టణంలోని ఆటో, స్కూల్ బస్సుల డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐ మల్లికార్జున పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే..తల్లిదండ్రులపై చర్యలు

కలికిరి, ఆగస్టు 12: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని కలికిరి ఇన్‌స్పెక్టర్ కె. రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం రాత్రి ఆయన గుట్టపాలెం గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీఐ రెడ్డిశేఖర్ రెడ్డితోపాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 12:రాజకీయ కక్షతో తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు, ఓ మాజీ ప్రజాప్రతినిధి కుమారులు తమపై ఫిర్యాదు చేశారని బి.కొత్తకోట టీడీపీ నాయకుడు మొటుకు శివ సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక సందర్భంగా బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ మొటుకు గ్రామానికి చెందిన పలువురు విన్నపాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో ప్రభుత్వం తమ కుటుంబీకుల పేరున 3.75 ఎకరాల భూమికి పాసుపుస్తకం ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి సాగు చేసుకుంటూ, బ్యాంకులో రుణాలు తీసుకుని బోర్లు వేసి, అక్కడే ఇంటిని నిర్మించుకుని వ్యవసాయం చేసుకుంటున్నామన్నారు. మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు ఆ భూమిని లాక్కునేందుకు ప్రయత్నించగా కోర్టుకు వెళ్లి పర్మనెంట్ ఇంజంక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామన్నారు. దీంతో తమపై తప్పుడు ఫిర్యాదులు చేశారని, రెవెన్యూ అధికారులు దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు శివ సబ్‌కలెక్టర్‌ను కోరారు. మొటుకు గ్రామానికి చెందిన ఆరుగురి నుంచి మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు డబ్బు తీసుకుని భూమి అప్పగించాడని, 28 ఏళ్లు అవుతున్నా ఇంకా రిజిస్ట్రేషన్ చేయించలేదని బాధితులు మల్లికార్జున, శంకర, చంద్రప్ప, గణపతి సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రశాంతంగా వేలం

పీలేరు, ఆగస్టు 12: పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని షాపింగ్ గదులు, వారపు సంత కోసం సోమవారం నిర్వహించిన వేలం పాటలు ప్రశాంతంగా ముగిశాయి. సాధారణంగా ఏప్రిల్‌లో జరగాల్సిన వేలం సార్వత్రిక ఎన్నికల కారణంగా వాయిదా పడడంతో పంచాయతీ అధికారులు కేవలం 7 నెలల కాలపరిమితితో నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. దీంతో చాలా మంది కాంట్రాక్టర్లు వేలం పాటల పట్ల మొగ్గు చూపలేదు. 30 షాపింగ్ గదులకు గాను సామాజిక రిజర్వేషన్ల కారణంగా 20 గదులను మాత్రమే అధికారులు వేలంలో పెట్టగా, వాటి ద్వారా పంచాయతీకి నెలకు రూ.1,34,100లు ఆదాయం వచ్చింది. వారపు సంతను చింతపర్తికి చెందిన అశోక్ రెడ్డి రూ.10,47,000లకు దక్కించుకున్నారు.

20 లోడ్ల ఇసుక డంప్ సీజ్

గుర్రంకొండ, ఆగస్టు 12: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తరిగొండ బీసీ కాలనీ సమీపంలో అక్రమంగా ఇసుక నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో వీఆర్వో రెడ్డిశేఖర్, సచివాలయ మహిళా పోలీసు అధికారిణి ప్రసన్నభారతి దాడులు చేసి 20 లోడ్ల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంప్‌ను పోలీసులకు అప్పగించనట్లు వీఆర్వో తెలిపారు.

వయనాడ్ వరద బాధితులకు విద్యార్థుల విరాళం

మదనపల్లె టౌన్, ఆగస్టు 12: కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో వరద బాధితులను ఆదుకునేందుక స్థానిక విశ్వహిత డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు రూ. 52,521 విరాళాలను సేకరించారు. ఈ మొత్తాన్ని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు అందజేసి, కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఉదయభాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మదనపల్లె టౌన్, ఆగస్టు 12:ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణం లో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక బీటీ కళాశాల వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేసి, విద్యార్థుల భవిష్యత్‌కు కృషి చేస్తున్నామన్నారు. భవిత, గంగారాణి, వినయ్, కమలాకర్, మహేష్, శ్రీకాంత్, శ్రీనాథ్, ఉదయ, భానుప్రకాష్‌రెడ్డి, స్వప్న, సోఫియా తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

కురబలకోట, ఆగస్టు 12: మండలంలోని కురబలకోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హరినారాయణ, ఏపీవో వెంకటేష్‌లు తెలిపారు. మండల పరిధిలోని 13గ్రామ పంచాయతీలలో జరిగిన పనుల వివరాలు ఈ సభలో ప్రస్తావిస్తామని ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

ర్యాగింగ్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

కురబలకోట, ఆగస్టు 12: ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్ డేను పురస్కరించుకుని సోమవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. డీన్ తులసీరామ్‌నాయుడు, కోఆర్డినేటర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

పెద్దమండ్యం, ఆగస్టు 12: ప్రజలకు అందుబాటులో ఉండాలని పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎన్‌డీఏ కూటమి నేతలు సిద్ధవరం ప్రసాద్, దత్తాత్రేయరెడ్డి, ప్రభాకరరెడ్డి, బావాజీ, మేకల చలపతి తహసీల్దార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీటీలు గౌరిశంకర్, రవీంద్రనాయక్, మండల సర్వేయర్ హసీనా, ఇన్‌చార్జ్ ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అందరికీ అవసరం

పెద్దమండ్యం, ఆగస్టు 12: అందరిలో సేవా దృక్పథం రావాలని ఎంఈవో మనోహర్ పిలుపు నిచ్చారు. మండలంలోని కలిచెర్ల హైస్కూల్‌లో సోమవారం హైదరాబాద్ బెల్లాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 775 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాయినామ్‌దేవ్, భవాని, మోహన్‌కుమార్ మాట్లాడుతూపాఠశాల గ్రౌండ్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. మదనపల్లి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, మంగాపతి, సూర్య సుధాకర్, మల్లికార్జున, రాజేష్, విజయభాస్కర్, హెచ్ఎం రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ టౌన్ కమిటీ ఎన్నిక

మదనపల్లె టౌన్, ఆగస్టు 12:ఏబీవీపీ పట్టణ కమిటీని సంస్థ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె.మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా కిశోర్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా మోహన్‌రాజు, సహాయ కార్యదర్శులుగా రామశివారెడ్డి, మౌనిష్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా వినయ్, కార్తీక్, అఖిల్, విజయ్‌లను ఎన్నుకున్నారు.


గ్రామ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడండి

తంబళ్లపల్లె, ఆగస్టు 12: గ్రామ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు తోడ్పడాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. సర్పంచుల విధులు, నిధుల వినియోగం, చేపట్టాల్సిన పనులు, పలు చట్టాలపై రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ నాయక్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


నిమ్మనపల్లి: మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు శానిటేషన్, సాయిల్ వేస్ట్ మేనేజ్‌మెంట్(ఆర్‌జీఎస్ఎ)పై ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్ శిక్షణ ఇచ్చారు. టీవోటీలు నవాజ్, మారుప్ప, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకిపురం: విధుల విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వాల్మీకిపురం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.సూపరింటెండెంట్ షబ్బీర్ అహ్మద్, ఈవో ఉదయ్‌కుమార్, వివిధ గ్రామాలలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే తిప్పలే..



ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై వర్షపునీరు



జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో నిలిచిపోయిన వర్షం నీళ్లు

ఆదివారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి మదనపల్లె అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. సోమవారం ఉదయం నుంచే స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా లోతట్టు ప్రాంతాలను పరిశీలించి అధికారులను చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పట్టణంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండడంతోనే ఈ పరిస్థితికి కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. -మదనపల్లె అర్బన్

బైక్‌లు ఢీకొని వృద్ధుడి మృతి

వాల్మీకిపురం, ఆగస్టు 12: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. మదనపల్లె రూరల్ మండలం గుండవారిపల్లెకు చెందిన నల్లప్ప(65) తన అల్లుడితో కలిసి ద్విచక్రవాహనంలో వాల్మీకిపురానికి వచ్చాడు. గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలతో మాట్లాడి స్వగ్రామానికి తిరిగి వెళుతూ సబ్‌జైలు భవనాల సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నల్లప్ప మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అదనపు ఎస్ఐ శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి మహిళ ..

రామసముద్రం, ఆగస్టు 12: ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి ఓ మహిళ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు.. మండలంలోని ఎలకపల్లె పంచాయతీ కురప్పల్లెకు చెందిన నారాయణస్వామి భార్య రత్నమ్మ సోమవారం పొలం వద్దకు వెళ్తూ దారి పక్కనున్న నీటి కుంటలో జారి పడింది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న కుటుంబ సభ్యులు కుంట నుంచి రత్నమ్మను వెలికి తీయగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు.

కారు ఢీకొని యువకుడు

బి.కొత్తకోట, ఆగస్టు 12: మండలంలోని కాండ్లమడుగు క్రాస్ పెద్దపల్లి వద్ద సోమవారం రాత్రి వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మదనపల్లె పట్టణ పరిధిలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీనాథ్(27)గా గుర్తించారు. సంఘటన జరిగిన వెంటనే 108 వాహనానికి సమాచారం అందించినా సకాలంలో వాహనం అక్కడికి చేరుకోలేదని, సకాలంలో చేరి ఉంటే యువకుడి ప్రాణాలు మిగిలి ఉండేవని స్థానికులు రోడ్డుపై ఆందోళన చేశారు. బి.కొత్తకోట పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రామసముద్రం, ఆగస్టు 12: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన కారు అదుపుతప్పి మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం మలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. కారులో ఉన్న కిశోరాచారి, నారాయణాచారి, ఎర్రప్పాచారి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కరెంట్ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

తల్లి, ఇద్దరు బిడ్డల అదృశ్యం

మదనపల్లె అర్బన్, ఆగస్టు12:తల్లితోపాటు ఇద్దరు పిల్లలు అదృశ్యం అయినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. స్థానిక చంద్రాకాలనీకి చెందిన సాధిక్ భార్య హసీనా(32) సోమవారం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఎక్కడికో వెళ్లి పోయింది. భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉండగా పెద్ద కుమారుడిని ఇంటి వద్ద ఉండమని చెప్పి మిగిలిన ఇద్దరితో ఇల్లు వదలి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కేసు నమోదు చేశారు

కలకడ తహసీల్దార్‌గా ఫణికుమార్

కలకడ, ఆగస్టు 12:కలకడ తహసీల్దార్‌గా ఫణికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలంలో డీటీగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు

వాల్మీకిపురం ఎంపీడీవోగా మనోహరరాజు

వాల్మీకిపురం, ఆగస్టు 12: వాల్మీకిపురం ఎంపీడీవోగా మనోహరరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సుధాకర్‌రెడ్డి రామసముద్రానికి బదిలీ అయ్యారు. వాల్మీకిపురం ఎస్ఐ2గా శ్రీహరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

పీటీఎం ఎంపీడీవోగా బాలాజీ

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 12: ఎంపీడీవోగా కేఎన్ బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మానందరెడ్డి గుర్రంకొండకు బదిలీ అయ్యారు.

'డ్రైనేజీ' అభివృద్ధికి చర్యలు తీసుకోండి



మురుగు కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా, కమిషనర్ ప్రమీల

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలను స్థానిక ఎమ్మెల్యే ఎం. షాజహాన్‌బాషా ఆదేశించారు. సోమవారం ఉదయం వర్షపు నీరు నిలచిన పలు ప్రాంతాలను కమిషనర్ ప్రమీలతో కలిసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరిశీలించారు. పట్టణంలో పలు చోట్ల మురుగు, వర్షపు నీరు రోడ్లపై పారుతుందంటూ స్థానికులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన కదిరి రోడ్డులోని శ్రీకృష్ణ కల్యాణ మండపం వద్ద నిలచిన మురుగు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. పట్టణంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రెడ్డీస్ కాలనీ, ప్రశాంతనగర్, ఆర్టీసీ బస్టాండ్, జడ్పీ స్కూల్ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీలతోపాటు టీడీపీ కౌన్సిలర్ తులసీ రామకృష్ణ, షంషీర్, మార్పురి నాగార్జునబాబు(గాంధీ), జేసీబీ వేణు, మధు, బిల్డర్ రామకృష్ణ, నీళ్ల భాస్కర, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి మార్పురి శశిధర్ నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటులో లోపాలను సవరించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12: ఉపాధ్యాయుల సర్దుబాటులోని లోపాలను సవరించాలని మదనపల్లె ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈవో ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటులో లోపాలను సరిదిద్దాలని కోరారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో జీతం తీసుకుంటున్న పాఠశాలనే ప్రాతిపదికగా తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పురం వెంకటరమణ, సుధాకర్, మోహన్, ఖాదర్‌బాషా, పైయని, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: పాఠశాల విద్య పని సర్దుబాటు ప్రక్రియలో నియోజకవర్గానికి మినహాయింపునివ్వాలని ఫ్యాప్టో సంఘం నాయకులు సోమవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డికి విన్నవించారు. పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్లకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ సమస్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అమరనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి, ఆదినారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్ల దగ్ధం కేసులో దోషులను అరెస్టు చేయాలి

ములకలచెరువు, ఆగస్టు 12: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాయంలో ఫైళ్లను దగ్ధం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మండల సీపీఐ కార్యదర్శి అంజనప్ప డిమాండ్ చేశారు. కబ్జాదారుల నుంచి భూములు స్వాధీనం చేసుకుని బాధితులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేశారు. సీపీఐ నాయకులు వేమనారాయణ, ఉత్తన్న, ఎల్లప్ప ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, మంత్రాల రమణ పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయవ్యాధి నయం

గుర్రంకొండ, ఆగస్టు 12: బీసీజీ టీకాతో క్షయవ్యాధిని నయం చేయవచ్చునని హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి అన్నారు. మండలంలోని తరిగొండ, బీసీ కాలనీ ప్రజలకు బీసీజీ టీకా ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

గుర్రంకొండ, ఆగస్టు 12: వ్యవసాయ కనెక్షన్లకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని పీలేరు డీఈ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం గుర్రంకొండ సబ్ స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్లపై ఉండే చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించాలన్నారు. కొందరు ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి ఉద్యోగులు పని తీరు మార్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో అన్నదానానికి ముస్లింల సహకారం



తిరుమలకు కూరగాయలు తరలిస్తున్న మండీ యజమానులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12: టీటీడీ అన్నదాన సత్రానికి మదనపల్లె పట్టణానికి చెందిన ఖాజీపీర్ కూరగాయ మండీ నుంచి ఖాజాపీర్, దాదాపీర్ సోదరులు ఏడు టన్నుల కూర గాయలను సోమవారం తిరుమలకు తరలించారు. స్థానిక వారపు సంత నుంచి టీటీడీ వాహనంలో కూరగాయలు నింపి, పూజలు నిర్వహించి తిరుమలకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాదిలో రెండు, మూడు పర్యాయాలు తిరుమల అన్నదాన ట్రస్టుకు కూరగాయలు అందజేయడం ఆనవాయితీ అన్నారు. గత 6 ఏళ్లుగా కూరగాయలను వివిధ ప్రాంతాల నుంచి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చేసిన భక్తుల కోసం అందించడం మాకు ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి మేము ముందు ఉంటామన్నారు.

ఇన్‌చార్జి డీఎం పాలనతో ఇబ్బందులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12: మదనపల్లె టూ డిపో మేనేజరును నియమించాలని ప్రయాణికులు, కార్మికులు డిమాండ్ చేశారు. డీఎం లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను సోమవారం వారు ఆర్టీసీ బస్టాండ్‌లో మీడియాకు తెలియజేశారు. ప్రస్తుతం వన్ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డిని టూ డిపో ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారని, ఆయన ప్రత్యేక శిక్షణకు, మీటింగ్‌లకు వెళ్లితే డిపో నిర్వహణ చాలా కష్టతరంగా మారిందన్నారు. ఈ డిపోలో 105 సర్వీసులు, 417 మంది ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారని, బస్టాండ్‌లోని గ్యారేజ్, షాపుల పర్యవేక్షణ ఉద్యోగులు చూస్తున్నారని తెలిపారు. ఇందులో ప్రత్యేక సర్వీసులు లేక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు అరికట్టాలి

పీలేరు, ఆగస్టు 12: స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు అరికట్టాలని ఏఐటీయూసీ నాయకులు పీలేరు తహసీల్దారును విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ రాజకీయ వేధింపులు ఉండవన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రాజకీయ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన చాలా మంది స్కీమ్ వర్కర్లు జీవనోపాధి కోల్పోయామన్న బాధలో ఆత్మహత్య ఆలోచన చేస్తున్నట్లు వాపోయారు. సీపీఐ నాయకులు టీఎల్ వెంకటేశ్, యశోద, వెంకటరత్నమ్మ, సుజాత, రెడ్డమ్మ, సుమతి, శ్రీలక్ష్మి, భారతమ్మ, లీలావతి, రాణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేలమల్లేశ్వస్వామి ఆలయ హుండీ లెక్కింపు

నిమ్మనపల్లి, ఆగస్టు 12: మండలంలోని తవళం పంచాయతీ అటవీ ప్రాంతంలో వెలసిన నేలమల్లేశ్వరస్వామి ఆలయ హుండీని సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ ఆధ్వర్యంలో, ఈవో మంజుల లెక్కించారు. ఆమె మాట్లాడుతూ మార్చి నుంచి ఇప్పటి వరకు రూ.36,500లు ఆదాయం వచ్చిందన్నారు. రూ. 3.20 కోట్లతో ఆలయ నిర్మాణం ప్రారంభించామని, ఆలయ గర్భగుడి పనులు పూర్తి కావస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాత్కాలిక ఛైర్మన్ రామకృష్ణ, సర్పంచ్ రెడ్డెప్ప, కమిటీ సభ్యులు జయరాం, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం

రామసముద్రం, ఆగస్టు 12: అఖిలభారత విద్యార్థి సమాఖ్య 89వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మదనపల్లె నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు ఓబులేశు జెండా ఆవిష్కరించారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వినయ్, సహాయ కార్యదర్శి కమలాకర్, రామసముద్రం మండల అధ్యక్ష కార్యదర్శులు ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రేపు కేవీకే స్వర్ణోత్సవాలు ప్రారంభం

కలికిరి, ఆగస్టు 12: దేశంలో కేవీకే స్థాపన జరిగి 50 ఏళ్ళయిన సందర్భంగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ జ్యోతి కార్యక్రమాన్ని ఐసీఏఆర్ నిర్వహిస్తోంది. కేవీకే శాస్త్రవేత్తల బృందాలు వ్యవసాయ రంగంలో అందించిన సేవలకు ప్రతీకగా ఈ జ్యోతి 11 అటార్నీ జోన్‌లను కలుపుకుంటూ డిల్లీలో ముగుస్తుంది. ఈ స్వర్ణోత్సవ జ్యోతి మంగళవారం తిరుపతి జిల్లాలోని పెరియవరం నుంచి కలికిరి కేవీకే వద్దకు చేరుకోనుంది. ఈ సందర్భంగా బుధవారం రైతులకు వివిధ శిక్షణ కార్యక్రమాలు, ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ మంజుల తెలిపారు.

20 లీటర్ల నాటు సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, ఆగస్టు 12: నాటుసారాను విక్రయిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామ సమీపంలోని చింత చెట్టు కింద నాటుసారాను అమ్ముతుండగా వెంగంవారిపల్లికి చెందిన కృష్ణప్ప(45) పట్టుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలిచామన్నారు.